





రాచర్లలో ఎండిపోయిన చెరువు

ఇంకా ఎన్నేళ్లు..?

పరిహారం కోసం అన్నదాతల ఎదురుచూపు

హంద్రీనీవా ఉప కాలువ కోసం భూములు ఇచ్చిన రైతులు

రూ.3.37 కోట్ల కోసం ఆరేళ్లుగా నిరీక్షణ

మూడేళ్ల కిందట కాలువకు అడ్డుగా మట్టి వేసిన వైనం

ఎండిపోయిన చెరువులు... అడుగంటిన భూగర్భ జలాలు

ఉరవకొండ, ఆగస్టు 31: హంద్రీనీవా ఉప కాలువకు భూములు కోల్పోయిన రైతులు పరిహారం కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో పరిహారంపై కొండంత ఆశలు పెట్టుకున్నారు. ఉపకాలువ నిర్మాణం కోసం రైతులు ప్రభుత్వానికి భూములు ఇచ్చారు. ఇందులో కాలువలు సైతం తవ్వారు. టీడీపీ హయాంలో కాలువలో నీళ్లు కూడా పారించారు. 2019 తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో రైతులకు పరిహారం ఇప్పించే ప్రయత్నాలు చేయక పోగా కాలువలకు నీళ్లు కూడా రాలేదు. ఏళ్ల గడిచినా రైతుల కు పరిహారం దక్కలేదు. ఉరవకొండ శివారులో హంద్రీనీవా ప్రధాన కాలువ 33వ ప్యాకేజీ ద్వారా మండలంలోని లత్తవరం, లత్తవరం తండా, షేక్షాను పల్లి, రాచర్ల తండాలోని చెరువులకు కృష్ణా జలాలు తరలించడానికి ఆరేళ్ల కిందట అధికారులు కాలువలు తవ్వారు. అందుకు గానూ లత్తవరం గ్రామానికి 30మంది రైతులు నుంచి 35ఎకరాల భూమిని సేకరించారు. కాలువలను తవ్విన తర్వాత రెండేళ్ల పాటు చెరువులకు నీటిని తరలించారు. అయితే కాలువ కోసం భూములు ఇచ్చిన రైతులకు ప్రభుత్వం పరిహారం మంజూరులో తీవ్ర జాప్యం చేసింది. బాధిత రైతులు అధికారుల చుట్టూ తిరిగినా ప్రభుత్వ యంత్రాంగం, నాయకుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం.

ప్రతిపాదనలకే పరిమితం

ఉపకాలువ నిర్మాణానికి సంబంధించి 30మంది రైతులకు రూ.3.37కోట్లు పరిహారం అందించాల్సి ఉంది. అప్పట్లో సీఎఫ్ఎంఎస్‌లో మూడు బిల్లుల రూపంలో వాటిని నమోదు చేశామని అధికారులు తెలిపారు. ఇప్పటి దాకా రైతుల ఖాతాల్లోకి జమకాలేదు. సీఎఫ్ఎంఎస్ బిల్లుల నెంబర్లు తీసుకుని రైతులు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం దక్కలేదు. ఇటు పంటలు పండక, అటు పరిహారం అందక బాధిత రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదు



మూడు ఎకరాల పొలాన్ని కోల్పోయా. సుమారుగా రూ.30లక్షల పరిహారం రావాల్సి ఉంది. వైసీపీ పాలనలో అధికారుల చుట్టూ తిరిగినా ఎలాంటి ప్రయోజనం కలగలేదు. ఇప్పటికే ఐదేళ్లు గడిచిపోయింది. అదిగో ఇస్తాం.. ఇదిగో ఇస్తాం.. అంటూ కాలం వెళ్లదీశారు.

- ఓబన్నరైతు, లత్తవరం

చెరువులు ఎండిపోయాయి



మూడేళ్ల నుంచి హంద్రీనీవా కాలువకు నీళ్లు వదలక పోవడంతో చెరువులు ఎండిపోయాయి టీడీపీ ప్రభుత్వంలోనైనా చెరువులకు నీళ్లు వస్తాయన్న నమ్మకం ఉంది. చెరువులు ఎండిపోవడంతో భగర్భ జలాలు అడుగంటాయి. 200అడుగుల వరకూ బోర్లు వేసినా నీళ్లు దొరకడం లేదు.

- ప్రసాద్‌నాయక్, షేక్షానుపల్లి తండా





హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీ కాలువ

వైసీపీ నిర్వాకంతో ఎండిన చెరువులు

వైసీపీ పాలకుల నిర్లక్ష్యంతో మండలంలోని లత్తవరం, లత్తవరం తండా, షేక్షానుపల్లి, రాచర్ల తండాలోని చెరువులన్నీ ఎండిపోయాయి. భూములు కోల్పోయి ఏళ్ల గడిచినా పరిహారం ఇవ్వకపోవడంతో ఆగ్రమించిన రైతులు మూడేళ్ల కిందట కాలువకు మట్టిని అడ్డంగా వేశారు. దీంతో గత మూడేళ్ల నుంచి చెరువులకు నీటిని వదలడం లేదు. ఈక్రమంలో నీరు రాక చెరువులు ఎండిపోయాయి. భూగర్భ జలాలు కూడా అడుగంటడంతో షేక్షానుపల్లి పంచాయతీ పరిధిలో సుమారుగా 400బోర్లు పైగా ఎండిపోయాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు సాగు, తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



కసాపురం హంద్రీనీవా కాలువ వద్ద పిల్ల కాలువ

పిల్లకాలువకూ ఇవ్వలేదు..



చెన్నప్ప కొట్టాల రోడ్డులో రైతుల భూమిలో ఏర్పాటుచేసిన పిల్లకాలువ..

గుంతకల్లు, ఆగస్టు 31: హంద్రీనీవా కాలువ నుంచి పాతకొత్తచెరువు వరకూ ఏర్పాటు చేసిన పిల్ల కాలువ కింద వదిలేసిన భూమికి పరిహారం ఇవ్వాలని నిర్వాసితులు కోరుతున్నారు. హంద్రీనీవా కాలువకు నీరు వచ్చిన కొత్తలో కసాపురం వద్ద ఒక తూమును ఏర్పాటుచేసి పాతకొత్త చెరువుకు అనధికారికంగా నీటిని వదిలారు. తమ భూముల పక్కనుంచి కాలువ వెళితే మంచిదేలే అనుకుని రైతులు పిల్లకాలువ ఏర్పాటుకు అనుమతించారు. ఆ తర్వాత 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక పాతకొత్తచెరువు, వైటీ చెరువులకు 0.6 టీఎంసీల నీటిని కేటాయిస్తూ జీవో విడుదల చేశారు. అప్పటి నుంచి ఇప్పటిదాకా పిల్లకాలువ విషయంగా రైతులకు ఇవ్వాల్సిన పరిహారం పెండింగులో ఉంది.

గ్రావిటీతో కాలువ ఏర్పాటు

కసాపురం నుంచి పాతకొత్తచెరువు, వైటీ చెరువులకు గ్రావిటీపై నీరు వెళ్లే పరిస్థితులు ఉండటంతో ఆయా గ్రామాల రైతుల విజ్ఞప్తి మేరకు హంద్రీనీవా కాలువలో తూమును ఏర్పాటు చేశారు. 2013లో పీఆర్పీ నాయకుడు వీకే సుధీర్ రెడ్డి రైతుల కోసం సొంత ఖర్చుతో ఎక్స్‌కవేటరును ఏర్పాటు చేసి పిల్లకాలువను తవ్వించారు. కాలువ ఏర్పాటై పదకొండేళ్లవుతున్నా రైతులకు రావాల్సిన పరిహారం మాత్రం అందలేదు. కసాపురం, చెన్నప్పకొట్టాల గ్రామాలకు చెందిన ఆదిలక్ష్మి, మారుతీ వరప్రసాద్, కే కృష్ణారెడ్డి, ప్రసాదరెడ్డి, గోపాల్ రెడ్డి, వీరుపాక్షిరెడ్డి, ఆదినారాయణ, చందు, కిష్టప్ప, చంద్ర, రామాంజనేయులు, శీన, బాషా తదితరులకు చెందిన మొత్తం 20 ఎకరాల భూమికి ప్రభుత్వం నుంచి పరిహారం రావాల్సి ఉంది. ఒక్కొక్కరికి రూ. 4 లక్షల నుంచి రూ. 8 లక్షల దాకా పరిహారాలు రావాల్సి ఉందని రైతులు తెలిపారు. ఈ రెండు గ్రామాలు కాక తిమ్మాపురం, నక్కనదొడ్డి, పాతకొత్తచెరువు గ్రామాలకు చెందిన రైతులకు కూడా పరిహారం రావాల్సి ఉన్నట్లు వారు తెలిపారు. మొత్తంగా రూ.1.5 కోట్లకుపైగా పరిహారం రావల్సి ఉందన్నారు.

11 ఏళ్లయినా పరిహారం అందలేదు



మా వ్యవసాయ భూమిలో అర ఎకరా వరకూ కాలువ కింద పోయింది. బోరుబావుల ద్వారా ఈ భూమిలో వరి సాగు చేసే వాళ్లం. ఇతర రైతులకూ ఉపయోగపడు తుందన్న ఉద్దేశ్యంతో పిల్ల కాలువను ఏర్పాటు చేయడానికి అంగీకరించాము. ఇప్పుడైనా పరిహారాన్ని ఇవ్వాలి. **- బి.ఆదిలక్ష్మి, కసాపురం**

పరిహారం ఇస్తామన్నారు కానీ..



కాలువ కింద వదిలేసిన భూములకు సంబంధించి కలెక్టరు, స్థానిక రెవెన్యూ అధికారులకు విన్నవించాము. పరిహారం వస్తుందని అన్నారు. కానీ పదకొండేళ్లయినా ఫలితం లేకుండాపోయింది. ఇప్పుడైనా చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నాము. **- బి.మారుతీ వరప్రసాద్, కసాపురం రైతు**

పశుగణన సర్వే వాయిదా

అనంతపురం అర్బన్, ఆగస్టు 31: జిల్లాలో ఆదివారం నుంచి నిర్వహించాల్సిన పశుగణన సర్వే వాయిదా పడింది. ప్రతి ఐదేళ్లకో మారు పశుగణన సర్వే నిర్వహిస్తూ వస్తున్నారు. సెప్టెంబరు 1 నుంచి డిసెంబరు నెలాఖరుదాకా 21వ భారత పశుగణన సర్వే చేయాలని నిర్ణయించారు. జిల్లాలోని గృహాలు, సంస్థల వద్ద ఉన్న అన్ని జాతుల పశువుల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేసేందుకు 189 మంది ఎన్యూమరేటర్లు, 53 మంది సూపర్ వైజర్లను ఎంపిక చేశారు. వీరికి మూడు వారాల క్రితం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పశుగణన సర్వే వివరాలు అప్‌లోడ్ చేసేందుకు రూపొందించిన యాప్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో సర్వేను వాయిదా వేశారు. సమస్య పరిష్కారమైన తరువాత సర్వేని ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

7న మద్యం దుకాణాల బంద్

అనంతపురం అర్బన్, ఆగస్టు 31: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో అవుట్ సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని ప్రభుత్వ మద్యం దుకాణాలను ఈ నెల 7న మూసియిస్తున్నామని ఏపీ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి శనివారం తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అన్ని ప్రభుత్వ మద్యం దుకాణాలను మూసివేసి బంద్ పాటించాలని సూపర్ వైజర్లు, సేల్స్‌మెన్‌ను కోరారు.

27 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, ఆగస్టు 31: జిల్లాలోని 27 మండలాల్లో శుక్రవారం వర్షం కురిసింది. అత్యధికంగా పుట్లూరులో 37.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. తాడిపత్రిలో 31.4, యాడికి 24.0, పెద్దపప్పూరు 18.6, గుంతకల్లు, నార్పల, శింగనమల 12.2, రాయదుర్గం 9.6, కంబదూరు 8.2, యల్లనూరు 7.2, శెట్టూరు 4.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 3.6 మి.మీ.లోపు వర్షపాతం నమోదైంది.

3 నుంచి పొలం పిలుస్తోంది: జేడీఏ

అనంతపురం అర్బన్, ఆగస్టు 31: జిల్లాలో ఈ నెల 3 నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తామని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ శనివారం తెలిపారు. ప్రతి మంగళ, బుధవారాల్లో అన్ని మండలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని చేపట్టాలని సిబ్బందికి సూచించారు. వ్యవసాయ అధికారితోపాటు అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు బృందాలుగా ఏర్పడాలని, నిర్దేశించిన కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఆయా తేదీల్లో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక గ్రామం, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల దాకా మరో గ్రామంలో పంట పొలాలను పరిశీలించాలని, రైతులతో గ్రామ సభలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆధునిక పద్ధతుల్లో పంటలను సాగు చేసుకునే విధానం గురించి రైతులకు అవగాహన కల్పించి, ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రోత్సహించాలని సూచించారు.

బియ్యం మాత్రమే..!

కార్డుదారులకు మళ్లీ నిరాశ

ప్రభుత్వ ఆదేశాలు పట్టని అధికారులు

రెండు ప్రాంతాలకే చక్కెర, గోధుమ పిండి

అనంతపురం టౌన్, ఆగస్టు 31: రేషన్ కార్డుదారులకు సెప్టెంబరు కోటాలోనూ బియ్యం మాత్రమే ఇవ్వనున్నారు. చక్కెర, కందిపప్పు అందించాలని సీఎం చంద్రబాబు ఆదేశించినా.. అధికారులు బియ్యానికే పరిమితం చేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ఈ నెల నుంచి బియ్యంతోపాటు చక్కెర, కందిపప్పు, గోధుమ పిండి అందుతాయని ఆశించిన పేదలకు నిరాశ తప్పడం లేదు. జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం 6,67,263 రేషన్ కార్డులు ఉన్నాయి. వీరికి రేషన్ పంపిణీ కోసం 1645 చౌక ధాన్యపు డిపోలు ఉన్నారు. ప్రతి నెలా 9,716 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం. బియ్యంతో పాటు ఇతర సరకులు జిల్లాలో ఉన్న 12 మండల లెవెల్ స్టాక్ పాయింట్ల నుంచి చౌకడిపోలకు సరఫరా చేస్తారు. అక్కడి నుంచి ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ సరకులను అందించాల్సి ఉంటుంది. బియ్యంతో పాటు లబ్ధిదారులకు అర కిలో కందిపప్పు, పంచదార కిలో, గోధుమ పిండి కిలో చొప్పున సబ్సిడీ ధరలకు ఇవ్వాల్సి ఉంటుంది. జూన్, జూలై, ఆగస్టు కోటాలో బియ్యం మాత్రమే పంపిణీ చేశారు. మార్కెట్‌లో నిత్యావసర సరకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇలాంటి సమయంలో కార్డుదారులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు బియ్యంతో పాటు చక్కెర, కందిపప్పు, గోధుమ పిండి అందిస్తే ఊరట చెందుతారు. కానీ అధికారులు పట్టించుకోవడం లేదు.




రెండు దుర్గాలకేనట..

సెప్టెంబరు కోటా సరుకుల గురించి జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు ప్రకటన ఇచ్చారు. ఈ నెలలో ఒకటో తేదీనే బియ్యం పంపిణీ జరుగుతుందని తెలిపారు. అన్ని నియోజకవర్గాల కార్డుదారులకు బియ్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. చక్కెర 325 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని, అంతమేరకు పంపిణీ చేస్తున్నామని ప్రకటించారు. గోధుమ పిండి కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 12 మెట్రిక్ టన్నులు, రాయదుర్గం నియోజకవర్గంలో 16 మెట్రిక్ టన్నులు ఉందని, ఆ రెండు నియోజకవర్గాలలో మాత్రమే బియ్యం, చక్కెరతో పాటు గోధుమపిండి ఇస్తామని పౌర సరఫరాలశాఖ డీఎం ప్రకటించారు.

నేటి నుంచి పంపిణీ

ప్రభుత్వం నుంచి చక్కెర, కందిపప్పు, గోధుమ పిండి పూర్తిస్థాయిలో సరఫరా కాలేదని డీఎస్ఓ శోభారాణి, డీఎం రమేష్‌రెడ్డి అన్నారు. రెండు నెలలుగా బియ్యం మాత్రమే ఇస్తున్నామని, ఈసారి బియ్యంతో పాటు చక్కెర ఇస్తున్నామని అన్నారు. కళ్యాణదుర్గం, రాయదుర్గంలో మాత్రమే గోధుమ పిండి అందుబాటులో ఉందని, దీంతో అక్కడ మాత్రమే ఇస్తున్నామని తెలిపారు. ఎండీయూ వాహనాల ద్వారా ఆదివారం నుంచి సరకుల పంపిణీ జరుగుతుందని తెలిపారు.



కసాపురం



మురడి



నేమకల్లు

నమో ఆంజనేయ..!

చివరి శ్రావణ శనివారం పోటెత్తిన భక్తులు

శ్రావణమాసం చివరి శనివారాన్ని పురస్కరించుకుని ఆంజనేయ స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కసాపురం, నేమకల్లు, మురిడి క్షేత్రాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. నేమకల్లులో ఆదివారం రథోత్సవం నిర్వహిస్తారు. కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి క్షేత్రంలో శనివారం రాత్రి గరుడ వాహనోత్సవాన్ని నిర్వహించారు. మురడి ఆంజనేయస్వామి ఆలయంలో చివరి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్ణాటక నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మూడు క్షేత్రాలలో భక్తులకు అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు.

- బొమ్మనహాళ్, డి.హీరేహాల్, గుంతకల్లు



వినాయక ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టరు, ఎస్పీ, జేసీ

గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా సాగాలి: కలెక్టర్

అనంతపురం టౌన్, ఆగస్టు 31: వినాయక చవిత ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం ఉత్సవ కమిటీల సమావేశం నిర్వహించారు. నగరపాలిక అధికారులు నిమజ్జనానికి ఉత్సవ కమిటీలతో సమన్వం చేసుకుని ఏర్పాట్లు చేయాలని సూచించారు. మట్టి వినాయకులను పూజించి పర్యావరణానికి మేలు కలిగేలా చూడాలని కోరారు. నిమజ్జనానికి నీటి నిల్వ తగినంత ఉండేలా చూడాలని జలవనరుల శాఖకు సూచించారు. ఆన్‌లైన్ యాప్ ద్వారా రూ.500 చెల్లించి.. ఉత్సవ కమిటీలు ముందుగా అనుమతి తీసుకోవాలని ఎస్పీ జగదీష్ సూచించారు. సమీక్షలో జేసీ శివనారాయణశర్మ, డీఆర్ఓ రామకృష్ణారెడ్డి, విద్యుత్‌శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, ఆర్డీఓలు శ్రీనివాసరెడ్డి, వసంతబాబు, రాణిసుష్మిత, కలెక్టరేట్ ఏఓ మారుతి, నగరపాలిక కమిషనర్ శ్రీహరిబాబు రూరల్ తహసీల్దారు హరికుమార్ పాల్గొన్నారు.

వర్షాలతో జాగ్రత్త

అనతపురం టౌన్: మూడు రోజులు పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంగాలని అధికారులను కలెక్టరు వినోద్ కుమార్ ఆదేశించారు. వర్షాలపై శనివారం సమీక్ష నిర్వహించారు. జిల్లా, డివిజన్, మున్సిపల్, మండలస్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. జేసీ, డీఆర్ఓ పర్యవేక్షించాలని, ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. కూలిపోయ పరిస్థితులలో ఉన్న భవనాలు వద్ద ఎవరూ ఉండకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. సహాయక చర్యలకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఏ సమస్య వచ్చినా వెంటనే 8500292992, 08554-220009 నంబర్లకు సమాచారం చేరవేయాలని ప్రజలను కోరారు.

అవసరమైతే పాఠశాలలకు సెలవు

అనంతపురం విద్య: వర్షాల కారణంగా ఇబ్బందులు ఉంటే పాఠశాలలకు సెలవు ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారి, ఎంఈఓలను కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. డీఈఓ వరలక్ష్మి, ఎంఈఓలు, సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారులు, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ శనివారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. పాఠశాలలకు విద్యార్థులు వెళ్లే మార్గంలో వాగులు, వంకలు ఉంటే జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాంటి ప్రాంతాలలో పాఠశాలలకు సెలవులు ప్రకటించాలని ఎంఈఓలు భావిస్తే.. డీఈఓ దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. పాఠశాలల ఆవరణలో గుంతలు, శిథిలావస్థకు చేరిన భవనాలు ఉంటే.. ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు విద్యాశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

వర్షంలోనే పింఛన్

అనంతపురం క్లాక్‌టవర్: అల్పపీడనం కారణంగా జిల్లా వ్యాప్తంగా ముసురు అలుముకున్నా.. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ తొలిరోజు 97 శాతం పూర్తి అయింది. జిల్లా వ్యాప్తంగా 663 గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది శనివారం ఉదయం 6 గంటల నుంచి లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి నగదు అందజేశారు. కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి 41 మంది అధికారులు పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు. ఆత్మకూరు మండలం బి.యాలేరులో కలెక్టర్‌వినోద్ కుమార్ పింఛన్ పంపిణీ చేశారు. సాయంత్రానికి 97 శాతం పంపిణీ పూర్తి చేసి జిల్లాను రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిపారు. మిగిలిన పింఛన్లను 2వ తేదీన పంపిణీ చేయాలని కలెక్టర్ సూచించారు.

నిర్ణయించిన ధరతోనే ఇసుక రవాణా చేయాలి

అనంతపురం టౌన్: జిల్లాలో నిర్ణయించిన ధరకే ఉచిత ఇసుక రవాణా చేయాలని కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం జరిగిన జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిటీ ఛైర్మన్‌గా తాను ఉంటానని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. రవాణా గురించే ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. అక్రమ రవాణా, అనధికారిక తవ్వకాలపై కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. రెవెన్యూ, పోలీస్ శాఖలతో కలిపి జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. స్టాక్ యార్డుల వద్ద క్లోజ్ సర్క్యూట్ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఇసుక రవాణా చేసే వాహనాలను వివరాలను నమోదు చేసుకోవాలని మైనింగ్ అధికారులకు ఆదేశించారు. ఇసుక ఫిర్యాదుల పరిష్కార వేదికను ఏర్పాటు చేయాలని, అక్కడ కంప్యూటర్, ఫోన్ నంబర్ అందుబాటులో ఉంచాలని సూచించారు. ఇసుక ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబర్లు 1800-4256039, 08554-298380 ఏర్పాటు చేశామని తెలిపారు.

పండుగ వస్తోంది !

- అనంతలో 5 నుంచి దులీప్ ట్రోఫీ నిర్వహణ
- రేపు నగరానికి అంతర్జాతీయ క్రికెటర్ల రాక
- పాసుల కోసం ఎగబడ్డ అభిమానులు
- ఏర్పాట్లు పరిశీలించిన మాంచో ఫెర్రర్
- క్రికెట్ గ్రౌండ్‌లో అధునాతన పరికరాలు


పాసుల కోసం కిక్కిరిసిన క్రికెట్ అభిమానులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 31: జిల్లా కేంద్రానికి క్రికెట్ పండగ వచ్చింది. అంతర్జాతీయ స్థాయిలో ఆడుతున్న భారత ఆటగాళ్లు అనంతపురానికి క్రికెట్ ఆడటానికి వస్తున్నారు. ఈ నెల 5 నుంచి 22 వరకు అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో దులీప్‌ట్రోఫీని నిర్వహించనున్నారు. ఆటగాళ్లు సోమవారం అనంతకు చేరుకుంటారు. 3, 4వతేదీలలో ఏసీజీలో ప్రాక్టీస్ కోసం ఏర్పాట్లు చేశారు. దీంతో ఇన్నాళ్లు టీవీల్లోనే అభిమాన ఆటగాళ్ల ఆట చూసిన జిల్లా ప్రజలు ప్రత్యక్షంగా వారిని చూసేందుకు ఎదురు చూస్తున్నారు. బీసీసీఐ, ఆంధ్రాక్రికెట్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే దులీప్‌ట్రోఫీకి సంబంధించిన పాసుల జారీ ప్రక్రియను శనివారం స్థానిక అనంత క్రీడాగ్రామం (ఏఎస్‌వీ)లో నిర్వహించారు. దీంతో ఉదయం 5గంటలకే ఏఎస్‌వీకి చేరుకున్న యువత ఉదయం 11గంటల వరకు వేచి ఉన్నారు. మొదటి మ్యాచ్‌కు సంబంధించి నాలుగు రోజుల పాటు నిర్వహించే క్రమంలో నాలుగు రోజుకుగాను 8వేలు పాసులు జారీ చేశారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా యువత పాసుల కోసం ఎగబడ్డారు. పోలీసులు, క్రికెట్ అభిమానుల మధ్య కాసేపు తోపులాట జరిగింది. ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ త్రీమెన్ కమిటీ సభ్యుడు మాంచోఫెర్రర్, ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరీ షాబుద్దీన్, ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ ఆదిత్య, బీసీసీఐ క్యురేటర్ సమందర్‌సింగ్‌లు పాసుల జారీ, వర్షం కారణంగా పిచ్ పరిస్థితిని ఏసీజీలో పరిశీలించారు. అంతర్జాతీయ స్థాయి ఆటగాళ్ల జిల్లాకు వస్తుండటంతో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్న పోలీసులకు సహకరించాలని అభిమానులను మాంచో ఫెర్రర్ కోరారు. జిల్లాలో దులీప్‌ట్రోఫీ నిర్వహణకు అవకాశం కల్పించినందుకు జిల్లా ప్రజల తరఫున బీసీసీఐ, ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అధునాతన పరికరాల ఏర్పాటు

దులీప్‌ట్రోఫీ నిర్వహణకు సంబంధించి అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో అధునాతన పరికరాలు అందుబాటులోకి తీసుకువచ్చారు. బీసీసీఐ క్యురేటర్ సమందర్‌సింగ్ ఆధ్వర్యంలో పిచ్‌ను ఏర్పాటు చేశారు. వర్షం పడిన తరువాత నీటిని తక్కువ సమయంలో పీల్చే అధునాతన పరికరం సూపర్ సాపర్ యంత్రాన్ని రూ.30లక్షలు వెచ్చించి విశాఖపట్నం నుంచి తీసుకువచ్చారు. పిచ్‌ను చదును చేయడానికి ఆరు రోలర్లను అందుబాటులో ఉంచారు. సుమారు మూడెకరాల గ్రౌండ్‌ను అరగంటలో గడ్డిని తొలగించే గ్రాస్‌కట్టర్-3250ను అమెరికాలో రూ.60లక్షలకు కొనుగోలు చేసి తెప్పించారు. వర్షం వస్తే మైదానం మొత్తాన్ని కప్పి ఉంచేందుకు సుమారు 20కి పైగా కవర్లు అందుబాటులో ఉంచారు. స్టేడియంలో 4వేల మంది ప్రేక్షకుల సామర్థ్యాన్ని మరో వెయ్యికి పెంచేందుకు తాత్కాలిక సీట్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రేక్షకులకు తాత్కాలిక మరుగుదొడ్లు, స్నాక్స్‌కు హోటల్ కౌంటర్లు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇక మునుపెన్నడూ లేని విధంగా మొదటిసారి ఏసీజీ నుంచి దులీప్‌ట్రోఫీ స్టార్‌స్పోర్ట్స్ నుంచి లైవ్ టెలికాస్ట్ చేసేందుకు భారీ టవర్ ఏర్పాటు చేశారు. వర్షం పడుతుండటం మూడు రోజుల పాటు వర్ష సూచనలు ఉండటంతో బీసీసీఐ ప్రతినిధులతో మాంచోఫెర్రర్ చర్చించారు. వాతావరణ పరిస్థితులను బీసీసీఐ హైకమిటీకి చేరవేసినట్లు తెలిపారు.


పాసుల కోసం క్యూలైన్‌లో యువతులు


అభిమానుల తోపులాటను అదుపు చేస్తున్న పోలీసులు


పాసులు జారీ చేస్తున్న సిబ్బంది

అందరూ సహకరించాలి

దులీప్ ట్రోఫీ నిర్వహణ సమీక్షలో కలెక్టర్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 31: అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో ఈనెల 5 నుంచి నిర్వహించే దులీప్‌ట్రోఫీ విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ కోరారు. ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో దులీప్‌ట్రోఫీ నిర్వహణపై శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాల ఓట తొలిసారి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న దులీప్‌ట్రోఫీ క్రికెట్ పోటీల విజయవంతానికి అన్ని శాఖల అధికారులు సహకరించాలని సూచించారు. ఏసీజీకి నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా చేయడానికి 160కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఎస్‌ఈని ఆదేశించారు. ప్రొటోకాల్ ప్రకారం ఫైర్ సేఫ్టీ, డిజాస్టర్ రెస్పాన్స్ మెకానిజం పాటించాలన్నారు. క్రికెట్ మ్యాచ్‌ల నేపథ్యంలో మంచి వైద్య సదుపాయం ఏర్పాటు చేయాలని కోరారు. అవసరమైన మందులు, ఓఆర్‌ఎస్ పాకెట్లు, అంబులెన్స్‌లను అందుబాటు లో ఉంచాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో నగరంలోని ప్రైవేటు ఆసుపత్రులను సైతం వాడుకునే ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి టీంకు ఒక లైజన్ ఆఫీసర్‌ను నియమించాలన్నారు. క్రికెట్ పోటీలను తిలకించేందుకు రెండో మ్యాచ్ నుంచి విద్యార్థులను అనుమతిస్తామన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని పోలీసుశాఖకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జగదీష్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ, ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ మేనేజర్ ఆదిత్యవర్మ, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ సంపత్‌కుమార్, డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి, ఆర్డీఓలు వసంతబాబు, శ్రీనివాసులు రెడ్డి, దులీప్‌ట్రోఫీ ఆర్గనైజింగ్ కమిటీ సెక్రటరీ షాబుద్దీన్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, మీడియా మేనేజర్ రాజ్‌గోపాల్, ఏసీఏ కోచ్ యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

విదేశీ భాషలతో మెండైన ఉపాధి

ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ అనిత


విదేశీ భాషా కోర్సుల ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ అనిత

అనంతపురం సెంట్రల్/క్లాక్‌టవర్, ఆగస్టు 31: విదేశీ భాషలు నేర్చుకున్న విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత పేర్కొన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు, సీఈ డాక్టర్ లోకేశ్‌తో కలిసి శనివారం ఆమె పీజీ డిప్లొమా ఫారిన్ లాంగ్వేజెస్ పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ ఎస్కేయూ, ఆర్డీటీ సంయుక్త ఆధ్వర్యంలో విదేశీ భాషల్లో పీజీ డిప్లొమా కోర్సులు అందిస్తున్నామన్నారు. ఇందులో స్పానిష్ 20, ఫ్రెంచ్ 19, జర్మన్ 20 సీట్ల ఉన్నట్లు వెల్లడించారు. ఒక సంవత్సరం కాలవ్యవధిలో ఈ భాషా కోర్సులను అందిస్తున్నట్లు తెలిపారు. వీటిలో ప్రవేశాలు పొందేందుకు జిల్లాలోని నిరుపేద విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. ఈ కోర్సులు అభ్యసించిన విద్యార్థులు విదేశీ పర్యాటకులకు గైడ్‌గా పని చేయవచ్చునన్నారు. సకాలంలో పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు జారీచేయడంలో పరీక్షల విభాగం అధికారులు, సిబ్బంది కృషి ఎనలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు నరసింహన్, నాగభూషణం రాజు, సూపరింటెండెంట్ చంద్ర, ఆర్డీటీ ప్రిన్సిపాల్ గీతాంజలి, కో-ఆర్డినేటర్ జోనస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌తో జాగ్రత్త: ఎస్ఈ

అనంతపురంరూరల్, ఆగస్టు 31: వర్షాలు కురుస్తున్న క్రమంలో ప్రజలు విద్యుత్ ప్రమాదాలబారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ సూచించారు. ముఖ్యంగా రైతులు మరింత జాగ్రత్తగా ఉండాలన్నారు. తడిసిన చేతులతో వ్యవసాయ మోటార్లుగానీ స్టార్టర్లు గానీ పట్టుకోవద్దన్నారు. తడిసిన కరెంట్ స్తంభాలు, విద్యుత్ లైన్‌కు తగులుతున్న చెట్లను ముట్టుకోవద్దన్నారు. ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులను తడిచిన చేతులతో తాకొద్దన్నారు. విద్యుత్‌కు సంబంధించిన ఏ వస్తువులను తడిచేతులతో తాకవద్దన్నారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడి ఉండటం, తాకేంత ఎత్తులో విద్యుత్ లైన్లు ఉన్నా వాటిని తాకవద్దన్నారు. విద్యుత్ అధికారులు, సిబ్బంది దృష్టికి సమస్యను తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. వర్షం పడుతున్న సందర్భంలో టీవీ, ఫ్రిడ్జ్, కంప్యూటర్‌ల స్విచ్‌లను ఆఫ్ చేసుకోవాలన్నారు. విద్యుత్ లైన్ల కింద సెల్ ఫోన్ మాట్లాడటం ప్రమాదకరమన్నారు. సొంతంగా విద్యుత్ మరమ్మతులు చేయొద్దని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ సమస్యలుంటే స్థానిక విద్యుత్ అధికారులు, లైన్‌మెన్, దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. అలాగే 1912 టోల్ ఫ్రీ నెంబరకు సమస్యలను తెలియజేయవచ్చునన్నారు.

రండి బాబూ రండి!

సెంట్రల్ యూనివర్సిటీలో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం సెంట్రల్/బుక్కరాయసముద్రం, ఆగస్టు 31: సెంట్రల్ యూనివర్సిటీలో డిగ్రీ కోర్సుల ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టినట్లు వర్సిటీ పరీక్షల నిర్వహణ అధికారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఏలో పొలిటికల్ సైన్స్, ఇంగ్లిష్. బీఎస్సీలో ఎకనామిక్స్, రిటైల్ మేనేజ్‌మెంట్ అండ్ ఐటీ, సైకాలజీ, కంప్యూటర్ సైన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బీబీఏ, బీకామ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. వీటిలో చేరేందుకు ఇంటర్మీడియేట్ పాసైన విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు సెప్టెంబరు 6లోపు admissions 2024@cuap.edu.in మెయిల్ ఐడికి మార్కుల జాబితా, రిజర్వేషన్ సర్టిఫికెట్స్‌తోపాటు అడ్మిషన్ కావాలనే కోర్సుల పేరుతో దరఖాస్తు పంపాలని సూచించారు. వివరాలకు https://cuap.ac.in/ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

తుంగభద్రకు కొనసాగుతున్న వరద

95.51 టీఎంసీలకు చేరిన నిల్వలు


కళకళలాడుతున్న తుంగభద్ర జలాశయం

బళ్లారి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాంకు వరద కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు భారీగా కురుస్తుండటం వల్ల డ్యాంకు వరద ఉధృతి పెరిగే అవకాశం ఉంది. విద్యుదుత్పత్తి ద్వారా 5000 క్యూసెక్కుల నీటిని నదిలోకి వదులుతున్నారు. డ్యాం నీటి నిల్వలు శనివారం రాత్రికి 95.519 టీఎంసీలకు చేరాయి. ఇన్‌ఫ్లో 38,759 క్యూసెక్కులు కాగా, మొత్తం ఔట్ ఫ్లో 10,067 క్యూసెక్కులు. ఆగస్టు 10న డ్యాం క్రస్ట్ గేటు కొట్టుకుపోవడంతో, ఆ స్థానంలో కొత్తగా స్టాప్‌లాగ్ ఎలిమెంట్ అమర్చిన విషయం విదితమే. క్రస్ట్ గేటు కొట్టుకుపోయిన సమయంలో వరద నీటితో పాటు డ్యాంలో 30 టీఎంసీల నీరు నదికి మళ్లించారు. దీంతో ఆయకట్టుకు సాగు నీరు రావేమోనని రైతులు ఆందోళన చెందారు. డ్యాం గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 105.7 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 95 టీఎంసీలు దాటింది.

జీడిపల్లి నుంచి కృష్ణా జలాలు విడుదల


కాలువలో కృష్ణా జలాల ప్రవాహం

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 31: జీడిపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా ప్రధాన కాలువకు 200 క్యూసెక్కుల కృష్ణా జలాలను శనివారం విడుదల చేశారు. అర్ధరాత్రి నుంచి మరో 200 క్యూసెక్కులు పెంచి మొత్తం 400క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలేలా చర్యలు తీసుకున్నట్లు జిల్లా జలవనరుల శాఖ సీఈ నాగరాజ, హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ఎస్ఈ దేసేనాయక్, ఈఈ రాజా స్వరూప్‌కుమార్ తెలిపారు. ఇప్పటికే దండోరా వేయించి కాలువ సమీపంలోని గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశామని వారు తెలిపారు. కళ్యాణదుర్గం ఆర్డీఓ, డీఎస్పీకి సైతం సమాచారం అందించామన్నారు. జీడిపల్లి మరువ నుంచి వెళ్లే కృష్ణా జలాలు పీఏబీఆర్‌కు చేరుతాయన్నారు. హంద్రీనీవా ప్రధాన కాలువ 304 కిలోమీటరు దగ్గర కుడివైపునకు మడకశిర బ్రాంచ్ కెనాల్ నుంచి గొల్లపల్లి రిజర్వాయర్‌కు చేరుతాయన్నారు. అదే హంద్రీనీవా 400కేఎం దగ్గర పుంగనూరు బ్రాంచ్ కెనాల్ మీదుగా 25కిలోమీటరు దగ్గర చెర్లోపల్లి రిజర్వాయర్‌కు వెళ్తాయన్నారు. చెర్లోపల్లి రిజర్వాయర్ నుంచి కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు నీళ్లు వెళ్తాయని వారు తెలిపారు.

పలువురు సీఐల బదిలీ

అనంతపురం క్రైం, ఆగస్టు 31: అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలో కొందరు సీఐలను బదిలీ చేశారు. అదే క్రమంలో కొందరిని వీఆర్‌కు పంపారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఏపీ మస్తాన్	ఎస్సీ, ఎస్టీ సెల్	గుంతకల్లు టూటౌన్
పి.గణేష్	గుంతకల్లు టూటౌన్	వీఆర్,ఎస్పీ,ఏటీపీ
వి.యుగంధర్	వీఆర్ ఎస్పీ, శ్రీసత్యసాయి	పామిడి యూపీఎస్
రాజశేఖరరెడ్డి	పామిడి యూపీఎస్	వీఆర్,ఎస్పీ,ఏటీపీ
కె.రామసుబ్బయ్య	వీఆర్, ఎస్పీ, అనంతపురం	యాడికి సర్కిల్
జయజయనాయక్	వీఆర్, ఎస్పీ, తిరుపతి	రాయదుర్గం
శ్రీనివాసులు	రాయదుర్గం	వీఆర్, ఎస్పీ, ఏటీపీ
నరేంద్రరెడ్డి	వీఆర్, ఎస్పీ, ఏటీపీ	నల్లమాడ సర్కిల్
శ్రీధర్	టీకే సముద్రం యూపీఎస్	రామగిరి సర్కిల్
శివ ఆంజనేయులు	రామగిరి సర్కిల్	వీఆర్, శ్రీ సత్యసాయి


టోల్‌ప్లాజావద్ద అడ్డుగా నిలిపిన లారీలు


యజమానులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

అధిక వసూళ్లపై ఆగ్రహం

టోల్‌ప్లాజా వద్ద లారీ యజమానుల ధర్నా

మంత్రి చొరవతో సమస్యకు పరిష్కారం

లేపాక్షి, ఆగస్టు 31 : టోల్ ప్లాజా వద్ద అధిక రుసుము వసూలు చేస్తున్నారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం లేపాక్షి మండలం చోళసముద్రం వద్ద ఉన్న టోల్‌ప్లాజావద్ద వాహనాలను అడ్డంగా నిలిపి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో లోడ్‌తో వెళ్తున్న లారీకి రూ.100, ఖాళీలారీకి రూ.50 వసూలు చేసేవారని, వారం రోజులుగా ప్రతి వాహనంపై రూ. 25 అదనంగా వసూలు చేస్తున్నారన్నారు. రహదారికి అడ్డంగా వాహనాలను ఆపి ధర్నా నిర్వహించారు. ఇదే సమయంలో బీసీ వెల్ఫేర్, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత అటుగా వచ్చారు. లారీలను అడ్డంగా ఉంచడంతో ఆమె ఆరా తీశారు. టీడీపీ మైనార్టీ నాయకులు షేక్షావలి, వాహన యజమానులు సమస్యను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే మంత్రి కలగజేసుకుని బోర్డు వేయకుండా అధికంగా రుసుము ఎలా వసూలు చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక వాహనదారులకు రుసుములో మినహాయింపు ఇవ్వాలని టోల్ సిబ్బందికి సూచించారు. మరో సారి అధిక వసూళ్లు చేయరాదని ఆదేశించారు. మంత్రి హామీతో లారీ యజమానులు ధర్నా విరమించారు.

కంది పంట పరిశీలన

విడపనకల్లు, ఆగస్టు 31: మండలంలోని విడపనకల్లు సరిహద్దు పొలాల్లో రైతులు సాగు చేసిన కంది పంట, వాటిలోని అంతర్ పంటలు కొర్ర, సజ్జలను అనంతపురం వ్యవసాయ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు మాధవిలతా, నారాయణస్వామి, నాగరాజ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కందికి సోకే వెర్రి తెగులు గురించి రైతులకు వివరించారు. ఇది వైరస్ తెగులు అని ఈ తెగులు సోకిన మొక్కలు లేత ఆకు పచ్చ రంగు గల చిన్న ఆకులను తొడుగుతుంది అన్నారు. దీని వల్ల పూత పూయదు, కాపు ఉండదు అన్నారు. ఈ తెగులు అసరియా కజాని అనే కంటికి కనిపించని ఇరియోపిడ్ నల్లి (మైట్స్) ద్వారా వ్యాపిస్తుంది అని తెలిపారు. ఇది వర్షాధారంతో పండించే భూముల్లో ఎక్కువగా సోకుతుందన్నారు. కంది విత్తిన 60 నుంచి 90 రోజుల్లో నల్లి నివారణకు లీటర్ నీటికి, 3 గ్రాముల గంధకం పొడిని నీటిలో కరిగేలా కలపాలి, లేదా ప్రొఫైర్గాట్ లీటరు నీటిలో 1-2మి.లీ కలిపి పది రోజులకు ఒక సారి మొక్కలపై పిచికారి చేయాలి అన్నారు. కందిలో సాగు చేసిన అంతర పంటలకు పైపాటుగా ఎకరాకు 15 కిలోల యూరియా చల్లుకోవాలన్నారు. ఇలా చల్లుకోవడం వల్ల అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ పద్మజా, ఏఓ హెచ్ పెన్నయ్య, ఏఈఓ రాఘవేంద్ర, రైతులు పాల్గొన్నారు.

ఉరవకొండ: మండలంలోని కోనాపురం, చిన్నముష్టూరు లత్తవరం గ్రామాల్లో సాగు చేసిన వేరుశనగ, కంది, ఆముదం పంటలను ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు మాధవి, నారాయణస్వామి, నటరాజ్ శనివారం పరిశీలించారు. పంటలకు తెగుళ్లు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు తెలియజేశారు.


కంది పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

రైతన్నా..! జాగ్రత్త

జిల్లా ఉద్యాన శాఖ అధికారి నరసింహారావు



అనంతపురం అర్బన్, ఆగస్టు 31: రాబోవు రెండు, మూడు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు పడనున్న నేపథ్యంలో ఉద్యాన పంటల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి నరసింహారావు శనివారం ఒక ప్రకటనలో సూచించారు. టమోటా, అరటి, బొప్పాయి పంటల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

అరటి పంటలో..

అరటిలో ముంపు నీరు ద్వారా వేరు వ్యవస్థ పాక్షికంగా లేదా పూర్తిగా దెబ్బతింటుంది. తద్వారా గెల తయారీ కోసం అవసరమైన నీరు, పోషక పదార్థాలు మొక్క తీసుకోలేదు. సాధ్యమైనంత త్వరగా పొలాల్లోని ముంపు నీటిని మురుగునీటి కాలువల ద్వారా బయటకు పంపాలి. ఆకులు, గెల బాగా తడిసే విధంగా లీటరు నీటికి ఐదు గ్రాములు సల్ఫేట్ ఆఫ్ పొటాష్, ఐదు గ్రాములు పొటాషియం నైట్రేట్ ఎరువులు మూడు రోజుల వ్యవధిలో మూడు సార్లు ఒకదాని తర్వాత మరొకటి పిచికారి చేయాలి. ఆ తర్వాత గెలలను ఎండిన అరటి ఆకులతో కప్పి ఉంచి పక్షం రోజుల్లో మార్కెట్ చేసుకోవాలి. వెదురు కర్రతో ఊతమిచ్చి మొక్కలు పడిపోకుండా చేసుకోవాలి. ఉద్యాన అధికారులు, శాస్త్రవేత్తలను సంప్రదించి మరిన్ని మెలకువలు పాటించాలి.

బొప్పాయిలో..

అధిక వర్షానికి బొప్పాయిలో పండు ఈగ ఉధృతి పెరిగే అవకాశం ఉంది. నివారణ కోసం మిథైల్ యూజినాల్ ఎరలను ఎకరాకు 10 నుంచి 15 ఏర్పాటు చేసుకోవాలి. వర్షాలకు రాలిన కాయలను వెంటనే మార్కెట్‌కు తరలించాలి. అధిక వర్షాలకు నేల కోతకు గురై నేల సారం తగ్గుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని సిఫార్సు చేసిన ఎరువులను 5-10 శాతం అధిక మోతాదులో వేసుకోవాలి. జింక్ సల్ఫేట్ రెండున్నర గ్రాములు లీటరు నీటికి , ఒక గ్రాము బోరాన్ లీటరు నీటికి, 10 గ్రాములు యూరియా ఒక లీటరు నీటికి కలిపి 20 రోజుల వ్యవధిలో పిచికారి చేసుకోవాలి. అధిక గాలుల నుంచి పంటను రక్షించేందుకు చుట్టూ దరి పంట వేసుకోవడంతోపాటు పడిపోయే అవకాశం ఉన్న చెట్లకు ఊతమివ్వాలి.

టమోటా పంటలో..

పొలంలో నిలిచిన నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపాలి. బోదెలు లేదా బెడ్లపై టమోటా నాటుకోవాలి. వర్షాలు ఆగిన వెంటనే 19-19-19 లేదా 13-0-45 లేదా యూరియా తదితర పోషకాలను పంటపై పిచికారి చేయాలి. అవసరమైతే సూక్ష్మ పోషకాలు పిచికారి చేసుకోవాలి. నేల కొంచెం ఆరిన తర్వాత రసాయన ఎరువులను వేసుకోవాలి. వర్షాలు ఆగిన తర్వాత అంతర సేద్యం చేసి కలుపు తొలగించుకోవాలి. పందిరిపై తీగజాతి కూరగాయలు సాగు చేసుకోవాలి.

మున్సిపల్ ఆర్డీ బదిలీ

అహుడా వైస్ చైర్మన్ కూడా..

అనంతపురం క్రైం, ఆగస్టు 31: మున్సిపల్ రీజనల్ డైరెక్టర్(ఆర్డీ) పీవీవీఎస్ మూర్తిని సీడీఎంఏ అడిషనల్ డైరెక్టర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ విశ్వనాథను నియమించారు. అనంతపురం-హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(అహుడా) వైస్ చైర్మన్ మురళీకృష్ణ గౌడ్‌ను సీడీఎంఏ కార్యాలయంలో ఏడీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

మాన్యువల్ స్కావెంజింగ్ ఫ్రీ జిల్లాగా అనంత: ఎస్సీ వెల్ఫేర్ డీడీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 31: మాన్యువల్ స్కావెంజింగ్ ఫ్రీ జిల్లాగా అనంతను జిల్లా కలెక్టర్ ప్రకటించినట్లు ఎస్సీ వెల్ఫేర్ డీడీ కుష్బూకొఠారీ తెలిపారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు, ప్రభుత్వాదేశాల మేరకు జిల్లాలో మాన్యువల్ స్కావెంజర్స్, ఇన్-శానిటరీ లెట్రిన్స్ వివరాలపై సర్వే చేశామన్నారు. అయితే జిల్లాలో మాన్యువల్ స్కావెంజర్స్, ఇన్-శానిటరీ లెట్రిన్స్ లేవని అన్ని పంచాయతీ కార్యాలయాలు, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాలకు నివేదికలు వచ్చాయన్నారు. అందులో భాగంగా కలెక్టర్ జిల్లాను మాన్యువల్ స్కావెంజింగ్ ఫ్రీగా ప్రకటించారన్నారు. అభ్యంతరాలు ఉంటే 11వ తేదీలోపు సంబంధిత మున్సిపల్, మండల ప్రజాపరిషత్ అధికారుల ద్వారా వివరాలను ఎస్సీ సంక్షేమశాఖ కార్యాలయానికి పంపాలన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు31: అంబేడ్కర్ గురుకులాల్లో 6, 7, 8 తరగతులకు కేటాయించిన అదనపు సీట్ల దరఖాస్తులకు సంబంధించి 3వ తేదీ వరకూ గడువు పొడిగించినట్లు జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. ఇదివరకు ఆగస్టు 30, 31వ తేదీలు గడువు విధించగా... తల్లిదండ్రుల నుంచి వచ్చిన వినతుల మేరకు 3 వరకు పొడిగించినట్లు తెలిపారు. అలాగే సెప్టెంబరు 1వ తేదీ నిర్వహించాల్సిన ప్రవేశపరీక్షను 4వ తేదీ నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షలో ముందు తరగతి సిలబస్‌లో 50 మార్కులకు ఉంటుందన్నారు.

మైనార్టీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీగా సుబ్రహ్మణ్యం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 31: మైనార్టీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీగా బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రహ్మణ్యం బాధ్యతలు చేపట్టారు. శనివారం కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇవరకు ఈడీగా విధులు నిర్వహిస్తున్న మధుసూదన్ తన ఫారిన్ సర్వీసు కాలం ముగియడంతో... మదనపల్లిలోని సొంత శాఖ అడల్ట్ ఎడ్యుకేషన్‌గా వెళ్లిపోయారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జి ఈడీగా సుబ్రహ్మణ్యంకు బాధ్యతలు అప్పగించారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం: కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ఆత్మకూరు ఆగస్టు 31: జిల్లాలో ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం అందిస్తామని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కూమార్ అన్నారు. మండలంలోని బి.యాలేరు సచివాలయంలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. అనంతరం రైతు ఈశ్వరయ్య చీనీ తోటలోరూట్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌ను ఆయన పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ సచివాలయం మీద నుంచి నీరు వెళ్లేలా ఏర్పాటు చేసిన స్ట్రక్చర్‌ను జాగ్రత్తగా చూసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఉద్యాన పంటలకు ప్రభుత్వ సహకారంతో హబ్‌గా మారుస్తామన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ విన్నూత, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మానాయక్, ఎంపీడీఓ శివవంకర్, అనూరాధ పాల్గొన్నారు.

డయాలసిస్ బాధితుడికి కొత్త పింఛన్



బాధితుడికి పింఛన్ అందిస్తున్న నాయకులు

రాప్తాడు, ఆగస్టు 31: ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేక చొరవతో డయాలసిస్ బాధితుడికి కొత్త పింఛన్ మంజూరైంది. మండలంలోని బోగినేపల్లి గ్రామానికి చెందిన టీడీపీ మద్దతుదారుడు నెట్టెం వెంకటరాముడు డయాలసిస్‌తో బాధపడుతున్నాడు. వైసీపీ ప్రభుత్వంలో పింఛన్‌కు దరఖాస్తు చేసుకోగా... టీడీపీ మద్దతుదారుడు కావడంతో పింఛన్ మంజూరు చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యేను కలిసి వెంకటరాముడు సమస్యను వివరించారు. ఆమె సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పింఛన్ మంజూరు చేయించారు. ఈనెల కొత్త పింఛన్ రూ.10 వేలు మంజూరు కావడంతో వెంకటరాముడు సంతోషం వ్యక్తం చేశాడు. సర్పంచ్ ఉజ్జినప్ప, నారా నారాయణ, కాటమయ్య, నాగప్ప, గొల్ల ముత్యాలప్ప, నారాయణస్వామి, దనా డయాలసిస్ బాధితుడి ఇంటి వద్దకు వెళ్లి పింఛన్ అందచేశారు.

స్పందించండి మహాప్రభో..!

● సత్యసాయి తాగునీటి కార్మికుల విన్నపం

గార్లదిన్నె, ఆగస్టు 31: తమ సమస్యను ప రిష్కరించి న్యాయం చేయండి మహాప్రభో అంటూ సత్యసాయి తా గునీటి కార్మికులు వేడుకుంటున్నారు. పదిరోజు ల నుంచి కార్మికులు సం బంధిత అధికారులకు మొరపెట్టుకుంటున్నా స్పందించకపోవడం దారుణమన్నారు. శనివారం కల్లూరు గ్రామంలో సత్యసాయి తాగునీటి కార్మికులు దున్నపోతుకు వినతి పత్రాన్ని అందచేసి నిరసన తెలిపారు. నాగభూషణం, మల్లరాయుడు, బాషా, సాంబశివ, నాగవర్ధన్, నాగేశ్వరావు, జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు, శంకర్ పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రీయ పోషణ్ మహోత్సవాలు

అనంతపురం విద్య, ఆగస్టు 31: దేశవ్యాప్తంగా 7వ రాష్ట్రీయ పోషణ్ మహోత్సవాలు ఆదివారం నుంచి 30 రోజుల పాటు 'రాష్ట్రీయ పోషణ్ మా'గా నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 11 ప్రాజక్టుల్లోని 2302 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాలు చేయాలన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 31: కంప్యూటర్, యోగా అంశాల్లో స్వల్పకాలిక ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి శనివారం ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు సెప్టెంబరు 3 నుంచి కళాశాలలో విద్యార్హత సర్టిఫికెట్స్‌ను సమర్పించి ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేయించుకోవాలని కోరారు. వివరాలకు 9849245925, 7995482414 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

హోంగార్డులకు ఆర్థిక సాయం

అనంతపురం క్రైం, ఆగస్టు 31: ఉమ్మడి అ నంతపురం జిల్లాలో హోంగార్డులుగా పని చేస్తూ పదవీ విరమణ పొందిన నలుగురికి ఎస్పీ జగదీష్ రూ.17,37,700 చెక్కులను అందజేశారు. హోంగార్డులు వెంకటసుబ్బమ్మ, నూర్జహాన్, రెహ్మాన్, గంగిరెడ్డి పదవీ విరమణ చేశారు. వీరిలో రెహ్మాన్ శుక్రవారం మరణించడంతో ఆయనకు రావాల్సిన రూ.4.32లక్షలు చెక్కును కుటుంబసభ్యులకు ఇంటికెళ్లి అందజేశారు. వెంకటసుబ్బమ్మకు రూ.4,39,200, నూర్జహాన్‌కు రూ.4,33,800, గంగిరెడ్డికి రూ.4,32,600 చెక్కులు అందజేశారు. అదనపు ఎస్పీ రమణమూర్తి, ఏఆర్ డీఎస్పీ మునిరాజ, ఏఓ శంకర్, ఆర్ఐలు రాముడు, మధు, ఎస్బీ ఎస్ఐ వెంకటక్రిష్ణ, సూపరింటెండెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

చదువుతో పాటు ప్రవర్తన ముఖ్యం: ప్రతి విద్యార్థికి చదువుతో పాటు ప్రవర్తన, గుణగణాలు ముఖ్యమని ఎస్పీ జగదీష్ అభిప్రాయపడ్డారు. జిల్లాకు చెందిన పోలీసు పిల్లల చదువులను ప్రోత్సహిస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు ప్రతిభా పురస్కారాలు(మెరిట్ స్కాలర్‌షిప్పులు) శనివారం ఎస్పీ అందజేశారు. స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి జిల్లాకు చెందిన 74మంది పోలీసు పిల్లలకు రూ.4,40,500 విలువ చేసే మెరిట్ స్కాలర్‌షిప్పులు పంపిణీ చేశారు.

వన్‌టౌన్ సీఐగా రాజేంద్రనాథ్ యాదవ్

అనంతపురం క్రైం,ఆగస్టు 31: అనంతపురం వన్‌టౌన్ సీఐగా రాజేంద్రనాథ్ యాదవ్‌ను నియమించారు. సీఐ రెడ్డప్ప బదిలీ నుంచి ఆ సీటు ఖాళీగా ఉంది. శ్రీ సత్యసాయి జిల్లా నల్లమాడ సీఐగా ఉన్న రాజేంద్రనాథ్ యాదవ్‌ను తాజా బదిలీల్లో కళ్యాణదుర్గం రూరల్ సీఐగా బదిలీ చేశారు. ఆ బదిలీ రద్దు చేస్తూ వన్‌టౌన్ సీఐగా నియమించారు. ఆదివారం లేదా సోమవారం ఆయన సీఐగా బాధ్యతలు చేపట్టనున్నారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

ఆత్మకూరు, ఆగస్టు 31: ఆర్టీసీ బస్సులో మహిళల నుంచి బంగారు చోరీ చేసిన నలుగురు మహిళలను అరెస్టు చేసినట్లు సీఐ వెంకటేశ్ నాయక్ శనివారం తెలిపారు. 26వ తేదీన కళ్యాణదుర్గం నుంచి అనంతపురానికి ఆర్టీసీలో బస్సులో నాగలక్ష్మి, శ్రీదేవిలు ప్రయాణిస్తుండగా మహిళా దొంగలు వారి నుంచి 25 గ్రాముల నల్లపూసల దండ, 39 గ్రాముల బంగారు నెక్లెస్ చోరీ చేసిన విషయం తెలిసిందే. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ వెంకటేశ్ నాయక్, ఇటుకలపల్లి సీఐ హేమంత్‌కూమార్ బృందలుగా ఏర్పడి రాచానపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు గంటా దుర్గాలక్ష్మి, గంటాలలితా, మేకల దుర్గా, తోట లలితాను శనివారం వడ్డుపల్లి గ్రామ సమీపం టోల్‌గేట్ వద్ద అరెస్టు చేశామన్నారు. చోరీ సొత్తును రికవరీ చేశామని తెలిపారు.

మహిళ ఆత్మహత్య

అనంతపురం క్రైం,ఆగస్టు 31: అనంతపురం రూరల్ మండలం సుందరయ్య కాలనీకి చెందిన ఓ మహిళ ఉరివేసుకుని మృతి చెందింది. షేక్ మున్నీ(38)కి 18 ఏళ్ల క్రితం అజీజ్‌తో వివాహమైంది. ఇద్దరు పిల్లలు పుట్టగానే మూడేళ్లకే ఆమెను భర్త వదిలేశాడు. గత కొంతకాలంగా అన్వర్ అనే ఆటో డ్రైవర్‌తో సహజీవనం చేస్తుండేది. ఆర్థిక ఇబ్బందులు పడుతూనే కొడుకు, కుమార్తెను చదివిస్తోంది. ఎప్పుడూ ఒకే పరిస్థితి ఉందంటూ తీవ్ర మనస్థాపానికి గురైన మున్నీ శుక్రవారం రాత్రి ఇంట్లోనే ఉరివేసుకుని మృతి చెందింది. బంధువుల ఫిర్యాదు మేరకు అనంతపురం రూరల్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

రాచానపల్లిలో నివాసముంటున్న ఓ బాలుడు నాలుగు రోజుల క్రితం విష ద్రావకం తాగి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. 25వతేదీ సాయంత్రం ప్రకాశం జిలాకు చెందిన ఆంజనేయులు కుటుంబం తల వెంట్రుకలు అమ్ముతూ అనంతపురం రూరల్ మండలం రాచానపల్లిలో నివాసముంటోంది. అతని కుమారుడు మహేష్ ఊళ్లు తిరుగుతూ పూసల మ్మేవాడు. కొన్ని రోజులుగా ఆ పనికి వెళ్లకుండా స్నేహితులతో కలిసి అల్లరిగా తిరుగుతున్నాడని తల్లి మందలించింది. క్షణికావేశంలో 25వ తేదీన విషద్రావకం తాగాడు. చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులందరికీ పింఛన్లు అందిస్తాం

● ఎమ్మెల్యే పరిటాల సునీత

కనగానపల్లి, ఆగస్టు 31: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండలం నరసంపల్లి, సోమరవాండ్లపల్లి గ్రామాలలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. శనివారం తెల్లవారుజామున నుంచే గ్రామాలలో అధికారులు, ప్రజాప్రతినిధులు పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. అధికారులు, గ్రామస్థులతో కలిసి ఇంటింటికి వెళ్లి పింఛన్ సొమ్మును ఎమ్మెల్యే స్వయంగా అందజేశారు. ముందుగా పింఛన్‌దారుల కుటుంబసభ్యుల పరిస్థితులను తెలుసుకుని నెలనెలా ఇంటివద్దనే పింఛన్లు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాట ఇచ్చారంటే ఎన్ని ఇబ్బందులున్నా నెరవేర్చుతారన్నారు. సర్పంచ్ సోమరచంద్రశేఖర్, కన్వీనర్ యాతం పోతలయ్య, పూజారి రాజాకృష్ణ, ఎంపీడీఓ అనిల్‌కుమార్, నాయకులు ఆదెప్ప, చంద్ర, బిల్లే దాము లక్ష్మణ్ పాల్గొన్నారు.

గార్లదిన్నె: పింఛన్‌దారుల సంతోషమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని శింగనమల నియోజకవర్గ టూమెన్ కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని తెలుగుతమ్ముళ్లు, అధికారులతో కలసి శనివారం ప్రారంభించారు. మండల వ్యాప్తంగా 7784 మందికి గాను 7480 పంపిణీ చేశారు. 96.22 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ విజయ్‌బాస్కర్ తెలిపారు. టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షులు ఆవులక్రిష్ణయ్య, గోరకాటి వెంకటేసు, జయరాం, సుబ్బయ్య, చల్లానాగరాజు, చితంబరప్ప పాల్గొన్నారు.

పింఛన్‌తో పేదలకు భరోసా

బుక్కరాయసముద్రం: ఎన్టీఆర్ భరోసా పింఛన్‌తో పేదల జీవనానికి భరోసాగా నిలుస్తోందని ద్విసభ్యకమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి అన్నారు. శనివారం పింఛన్ పండుగ కార్యక్రమంలో భాగంగా బుక్కరాయసముద్రం గ్రామ పంచాయతీ గౌరయ్య సేను కొట్టాలలో వారితో పాటు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి హాజరై పింఛన్లు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ ఎస్‌కే వెంకటేశులు, మండల కన్వీనర్ అశోక్, నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, కేశన్న, నారాయణస్వామి, అక్కులప్ప, శివ పాల్గొన్నారు. అలాగే సిద్దరాంపురం గ్రామంలో జిల్లా టీడీపీ ఉపాధ్యాక్షులు పసుపుల హనుమంతురెడ్డి, ఉపసర్పంచ్ నారాయణస్వామి అధ్వర్యంలో లబ్ధిదారుల ఇంటింటికీ తిరిగి పింఛన్లు పంపిణీ చేశారు.

రాప్తాడు: పింఛన్‌దారులందరికీ ఒక రోజు ముందే పింఛన్లు అందించిన ఘనత సీఎం చంద్రబాబుదే అని మండల కన్వీనర్ కొండప్ప తెలిపారు. శనివారం ఉదయం గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి రాప్తాడులో పింఛన్లు పంపిణీ చేశారు. రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాలు, తహసీల్దార్ విజయకుమారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురంరూరల్: పింఛన్‌దారులకు ఒక్కరోజు ముందుగానే సీఎం చంద్రబాబు తీసుకొచ్చారని మండల ప్రధాన కార్యదర్శి పాముదాయి రఘు అన్నారు. మండలంలోని పాముదాయి గ్రామంలో శనివారం పింఛన్



బుక్కరాయసముద్రంలో పింఛన్లు అందజేస్తున్న ఆలం, ముంటిమడుగు



కనగానపల్లిలో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయం 6గంటలకే సచివాలయ ఉద్యోగులతో కలసి టీడీపీనాయకులు పింఛన్లు పంపిణీ చేశారు. మండల ప్రధాన కార్యదర్శి పాల్గొని పింఛన్ పంపిణీ చేశారు. గ్రామ కమిటీ అధ్యక్షులు శ్రీనివాసులు, రాము, విశ్వనాథ్, సాయినాథ్, రామాంజనేయులు పాల్గొన్నారు. అలాగే ఎ.నారాయణపురం పంచాయతీ తపోవనంలో టీడీపీ నాయకులు ఇంటింటికి పింఛన్ పంపిణీ చేశారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు డిష్‌నాగరాజు, మాజీ ఉపసర్పంచు ఓబుళపతి, రఘునాథ రాయల్ ఇంటింటికి తిరుగుతూ.. పింఛన్ పంపిణీ చేశారు.

ధర్మవరంరూరల్(కనగానపల్లి): కనగానపల్లి మండలవ్యాప్తంగా 91శాతం పింఛన్లు పంపిణీ పూర్తిచేసినట్లు ఎంపీడీఓ అనిల్‌కుమార్ తెలిపారు. మండలవ్యాప్తంగా 18 పంచాయతీల్లో శనివారం పంపిణీ చేశామని, మిగిలినవి సోమవారం అందిస్తామన్నారు. టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య, పూజారి రాజాకృష్ణ, కుళ్లాయప్ప, ఆంజనేయులు, యువరాజ్, ఉమాపతి పాల్గొన్నారు.

శింగనమల: మండలంలో సామాజిక పింఛన్లను అధికారులు, టీడీపీ నాయకులు వర్షంలోనే ఇంటింటికీ వెళ్లి పింఛన్‌దారులకు అందజేశారు. శనివారం ఉదయం 5.30 గంటలకే గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 99 శాతం పంపిణీ చేశారు. మండల సెప్షల్ ఆఫీసర్ చంద్రశేఖర్, తహసీల్దార్ బ్రహ్మయ్య, ఈఓపీఆర్‌డీ మురళీకృష్ణ, సర్పంచ్ దేగల లలితమ్మ పాల్గొన్నారు.



సిద్దరాంపురంలో...



అనంతపురం రూరల్‌లో...



రాప్తాడులో...



శింగనమలలో...

పింఛన్ల పంపిణీలో టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 31: అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలో శనివారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు భాగస్వామ్యులయ్యారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ సూచనల మేరకు స్థానిక సచివాలయ సిబ్బందితో కలిసి పలువురు నాయకులు శనివారం ఉదయం నుంచే పింఛన్లు అందజేశారు. 30వ డివిజన్‌లో మాజీ మేయర్ స్వరూప. 27, 29వ డివిజన్లలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తలారి ఆదినారాయణ, జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ, నారాయణస్వామి యాదవ్, ఎన్‌బీకే నారాయణస్వామి, రెండో డివిజన్‌లో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచెపు వెంకటేష్, 31వ డివిజన్‌లో క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్, మూడవ డివిజన్‌లో కందుకూరి నాగరాజు, రాధ, 28వ డివిజన్‌లో వెంకటరామయ్య, మనోహర్, రామాంజనేయులు, 13వ డివిజన్‌లో కురబ నారాయణస్వామి, బండి కాశీ విశ్వనాథ్, లక్ష్మీనాయుడమ్మ, చిత్ర నాగరాజు, 43, 44, 45వ డివిజన్లలో దేవళ్ల మురళీ, 20వ డివిజన్‌లో పీఎం లక్ష్మీప్రసాద్, 50వ సచివాలయం పరిధిలో నెట్టెం బాలకృష్ణ, 21వ డివిజన్‌లో లక్ష్మీనరసింహులు, 10వ డివిజన్‌లో పోతుల లక్ష్మీనరసింహులు పింఛన్లు పంపిణీ చేశారు.

పాడి రైతులకు మెరుగైన సేవలు

● పశుసంవర్థక శాఖ ఇన్‌చార్జి జేడీ వెంకటస్వామి



ఇన్‌చార్జి జేడీకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 31: జిల్లాలోని పాడి రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని పశుసంవర్థక శాఖ ఇన్‌చార్జి జేడీ వెంకటస్వామి పేర్కొన్నారు. శనివారం జేడీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు జేడీగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం శనివారం పదవీ విరమణ పొందారు. పెనుకొండ గొర్రెలు,మేకల పెంపక క్షేత్రం డీడీ వెంకటస్వామికి ఇన్‌చార్జి జేడీగా బాధ్యతలు అప్పగించారు. పలువురు అధికారులు, ఉద్యోగులు నూతన జేడీకి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయింపు

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 31: మండల కేంద్రంలోని బీసీకాలనీలో ఆలయ నిర్మాణానికి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేక చొరవతో అధికారులు స్థలాన్ని కేటాయించారు. ఇటీవల ఎమ్మెల్యే చెన్నేకొత్తపల్లిలో ఫిర్యాదుల పరిష్కార వేదికకు హాజరైన సమయంలో స్థానిక బీసీ కాలనీవాసులు సుబ్రహ్మణ్య స్వామి ఆలయాన్ని నిర్మించాలని తలంచామని, స్థలంకేటాయించాలని వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే స్థలాన్ని కేటాయించడంపై అధికారులను ఆదేశించారు. ప్రజలకు అనుకూలం ఉన్న స్థలాన్ని కేటాయిస్తూ శనివారం అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, వడ్డె శ్రీనివాసులు, వడ్డె దుర్గా, చెన్నకేశవులగౌడ్, నాగరాజు, మహేశ్, ఈడిగ భార్గవగౌడ్ పాల్గొన్నారు.

సీఎం దృష్టికి వడ్డెర్ల సమస్యలు



సీఎం చంద్రబాబుకు సమస్యలు విన్నవిస్తున్న కనగానపల్లి టీడీపీ నాయకులు

ధర్మవరం రూరల్ (కనగానపల్లి), ఆగస్టు 31: వడ్డెర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు కనగానపల్లి మండలం రాంపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గడ్డం నాగభూషణ, బాలేపాళ్యం వెంకట్ తెలిపారు. వడ్డెర్ల సమస్యలపై వారు శనివారం మంగళగిరిలో ముఖ్యమంత్రిని కలిసి విన్నవించామన్నారు. దీనిపై స్పందించిన సీఎం వడ్డెర్ల సమస్యలను, ఆర్థికంగా ఎదుగుదలకు అన్నివిధాల సహకరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం అర్బన్, ఆగస్టు 31: భారీ వర్షాల నేపథ్యంలో అనంతపురం నగర పాలక సంస్థ అధికారులు అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఒక ప్రకటనలో ఆదేశించారు. రాబోవు మూడు రోజులపాటు రాష్ట్రంలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించిందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రజలకు టీడీపీ నాయకులు అందుబాటులో ఉండాలన్నారు. అనంతపురం నగర పాలక సంస్థ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. 08554-230234, 274765 నెంబర్లతోపాటు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం 9000900821, 7337125834 నంబర్లను సంప్రదించాలన్నారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

అనంతపురం రూరల్: వర్షాల నేపథ్యంలో అనంతపురం అర్బన్, రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు అర్బన్ తహసీల్దార్ హరికుమార్, రూరల్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. రాబోయే మూడు రోజుల్లో తుఫాను కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు సూచనలున్నాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్‌రూంకు తెలియజేయాలన్నారు. అర్బన్ పరిధిలోని వారు 9642922911, రూరల్ వారు 7330681293 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

రాప్తాడు: మండలంలో భారీ వర్ష సూచన ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ విజయకుమారి ఒక ప్రకటనలో కోరారు. వర్షాల వల్ల ఎక్కడైనా ప్రజలకు ఇబ్బంది కలిగితే వెంటనే కంట్రోల్ రూంకు 9014888316 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

జేఎల్ మురళీధర్‌కి డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందుకుంటున్న అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 31: అర్బన్‌బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. శనివారం తమిళనాడులోని హోసూరులో ఉన్న ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ వరప్రసాద్, రిజిస్ట్రార్ రామకృష్ణ చేతుల మీదుగా మురళీధర్‌కు గౌరవ డాక్టరేట్ అందజేశారు. తన సేవలను గుర్తించి డాక్టరేట్ ప్రదానం చేసిన ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీకి కృతజ్ఞతలు తెలిపారు. మురళీధర్‌కు బ్యాంకు పాలకవర్గం, అధికారులు, టీడీపీ నాయకులు, అభిమానులు అభినందనలు తెలిపారు

కృష్ణంరెడ్డిపల్లిలో అన్నదానం

అనంతపురం రూరల్, ఆగస్టు 31: శ్రావణ మాసం చివరి శనివారం కోవడంతో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇటుకలపల్లి సీఐ హేమంత్‌కుమార్ హాజరై గ్రామస్థులకు అన్నదానం చేపట్టారు. గ్రామపెద్దలు రామకృష్ణ, నగేష్, పోలేరయ్య, మారుతిప్రసాద్, తిరుపతయ్య, రామాంజినేయులు, తిరుపాలు, అనంతయ్య, పోలన్న, రమేష్, గణేష్, మారుతి పాల్గొన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా హరికుమార్

అనంతపురంరూరల్, ఆగస్టు 31: అనంతపురం రూరల్ మండలం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా అనంతపురం అర్బన్ తహసీల్దార్ హరికుమార్ నియమితులయ్యారు. ఆమేరకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల రూరల్ తహసీల్దార్‌గా వాణిశ్రీ నియమించారు. అయితే ఆమె విధుల్లోకి చేరలేదు. ఈనేపథ్యంలో అర్బన్ తహసీల్దార్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

బీజేపీలో చేరిన వైసీపీ నాయకుడు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 31: శింగనమల నియోజకవర్గ వైసీపీ యూత్ విభాగం నాయకుడిగా పనిచేసిన గంగా రాజేష్ బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. శనివారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని కలిసి ఆ పార్టీలో చేరినట్లు రాజేష్ తెలిపారు. ఆయనతోపాటు సిద్ధరాంపురానికి చెందిన వైసీపీ నాయకులు కొండారెడ్డి, పలువురు బీజేపీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారని పేర్కొన్నారు. అజేష్‌యాదవ్, సూర్యప్రకాష్‌రెడ్డి, మంజుల వెంకటేష్, సాయినాథరెడ్డి పాల్గొన్నారు.

12 గంటలలోపే బాలుడి మిస్సింగ్ కేసు ఛేదింపు

● తల్లిదండ్రుల చెంతకు చేరిన బాలుడు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 31: అనంతపురం రైల్వే స్టేషన్‌లో శుక్రవారం అదృశ్యమైన బాలుడి ఆచూకీని రైల్వే పోలీసులు 12 గంటలలోపే ఛేదించారు. బాలుడు గానయోగిని తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. రైల్వే పోలీసులు వెల్లడించిన మేరకు ప్రకాష్, శారదాబాయిల మూడేళ్ల కుమారుడు గానయోగి, ఏడు నెలల కూతురుతో కలిసి శుక్రవారం రాయచూర్ నుంచి బెంగళూరులో కులీ పనుల నిమిత్తం రైలు నెంబర్ 11301 ఉద్యాన్ ఎక్స్‌ప్రెస్‌లో రాయచూరు నుంచి జనరల్ బోగీలో బయలు దేరారు. మధ్యలో ప్రకాష్ కొడుకు గానయోగిని పక్కన కూర్చోబెట్టుకొని కునుకు తీశాడు. అదే రైల్లోనే పక్కనే ప్రయాణిస్తున్న గుల్బర్గకు చెందిన జంట రూపేష్, కుసుమ దీన్ని గమనించి గానయోగిని అపహరించి అనంతపురం రైల్వే స్టేషన్‌లో దిగి తిరిగి బస్సు ప్రయాణం ద్వారా గుల్బర్గకు చేరారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని డీఎస్పీ అబ్దుల్ అజీజ్, సీఐ నాగరాజు పర్యవేక్షణలో బాలుడి ఆచూకీ కోసం గాలించారు. లభించిన ఆధారాల మేరకు జీఆర్‌పీ ఎఫ్ ఎస్ఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గాలిస్తుండగా రాయచూరు ఆర్‌పీఎఫ్ సీఐ సహకారంతో గుల్బర్గకు వెళుతున్న జంటతో పాటు బాలుడిని గుర్తించి రాయచూరు స్టేషన్‌లో అదుపులోకి తీసుకున్నారు. సమాచారం అందుకున్న అనంతపురం సిబ్బంది జంటతో పాటు బాలుడి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి బాలున్ని అప్పగించారు. జంటపై బాలుడి కిడ్నాప్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. గాలింపులో ఆర్‌పీఎఫ్ సీఐ రవిప్రకాష్, ఏఎస్ఐ రఫీ, జీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్స్ శ్రీరాములు, దామోదర్, కానిస్టేబుల్స్ భాస్కర్, నరేష్, సురేష్ పాల్గొన్నారు.



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

భక్తిశ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం



సాయినాథ మందిరంలో పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

అనంతపురం కల్చరల్, ఆగస్టు 31: ఏడుశనివారాల వ్రతాల్లో భాగంగా చివరి శనివారం నగరంలోని పలు ఆలయాల్లో వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేణుగోపాల్ సద్గురు సాయినాథ మందిరం, ఆర్ఎఫ్ రోడ్డు లక్ష్మీ వెంకటేశ్వర దేవాలయం, రామ్‌నగర్ వెంకటేశ్వర దేవాలయం, అశోక్‌నగర్ సత్యనారాయణస్వామి దేవాలయం, శారదానగర్‌లోని శృంగేరి శంకరమఠం, శివబాలయోగి ఆశ్రమాల్లో వేదపండితులు మంత్రోచ్ఛారణల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పూజాది కైంకర్యాలు నిర్వహించారు. పండితులు వ్రతవిశిష్టతను వివరిస్తుండగా భక్తులు సామూహికంగా వ్రతాలను ఆచరించారు.



ఏడు శనివారాల వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

నూతన ఆవిష్కరణలే దేశాభివృద్ధి సూచికలు


● జేఎన్‌టీయూ డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ



విద్యార్థులకు కప్‌లను అందజేస్తున్న అనంతరాముడు, సత్యనారాయణ

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 31: సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలే దేశాభివృద్ధి సూచికలని జేఎన్‌టీయూ డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అండ్ ప్లానింగ్ ప్రొఫెసర్ సత్యనారాయణ అన్నారు. శనివారం అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రొఫెసర్ సత్యనారాయణతోపాటు కళాశాల చైర్మన్ అనంతరాముడు, వైస్ చైర్మన్ రమేష్ నాయుడు ముఖ్య అతిథులుగా హాజరై వేడుకలను ప్రారంభించారు. సత్యనారాయణ మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాల్లో భారత్ నాల్గవస్థానంలో ఉందన్నారు. ప్రథమ స్థానంలోకి వెళ్లాలంటే సరికొత్త ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు సృష్టించాలని విద్యార్థులకు సూచించారు. చైర్మన్ అనంతరాముడు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు కళాశాలలో ఇంజనీరింగ్ విద్యనందిస్తున్నామని తెలిపారు. అనంతరం నిర్వహించిన క్రీడాపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కప్‌లను అందజేశారు. విభాగాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఎఫ్‌డీపీ శిక్షణ



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్లు, పీవీకేకే అధ్యాపకులు

అనంతపురంరూరల్, ఆగస్టు 31: పీవీకేకే ఐటీ కళాశాలలో నిర్వహించిన ఎలక్ట్రిక్ వెహికల్ టెక్నాలజీ అనే అంశంపై నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శనివారంతో ముగిసింది. చివరి రోజు తిరుపతి ఎస్వీయూ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్ విభాగపు అసోసియేట్ ప్రొఫెసర్ ఉషారెడ్డి హాజరై కేవలం పదిపదిహేను నిమిషాల్లో వాహనాన్ని 80 శాతం వరకు చార్జ్ చేయగలిగే అల్ట్రా ఫాస్ట్ చార్జింగ్ సాంకేతికత గురించి వివరించారు. కళాశాల యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, పీవీకేకే ఐటీ ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ దీప్తి జోర్దాన, ఏఓ మనోహర్‌రెడ్డి, ఎఫ్‌డీపీ కన్వీనర్ శ్రీనివాసన్, కో-కన్వీనర్ హరిప్రసాద్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభకు ఎస్కేయూ వేదిక



విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రిన్సిపాల్

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 31: విద్యతోపాటు ఇతర అంశాలపై ప్రతిభను చాటేందుకు ఎస్కేయూ చక్కటి వేదికని వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర పేర్కొన్నారు. ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ విద్యార్థి అస్రిఫ షాను యూత్ ఫెస్ట్-2024 ప్రతిభా అవార్డుకు ఎంపికైంది. శనివారం ప్రిన్సిపాల్ రామచంద్ర విద్యార్థిని అభినందించి సర్టిఫికెట్‌ను అందజేశారు. హెచ్ఓడీ డాక్టర్ ఆంజనేయులతోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా జబ్బార్‌మియా

గుత్తి, ఆగస్టు 31: గుత్తి మున్సిపల్ కమిషనర్‌గా జబ్బర్‌మియా శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ శ్రీనివాసులు పెనుకొండకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలోకి మెదుకూరు మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న జబ్బర్ మియా బదిలీపై వచ్చారు. నూతన కమిషనర్‌కు చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు, మున్సిపల్ సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

సజావుగా కౌన్సిల్ సమావేశం

గుత్తి, ఆగస్టు 31: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గల కౌన్సిల్ హాల్లో శనివారం కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ వన్నూర్‌బీ అధ్యక్షతన, కమిషనర్ జబ్బర్ మియా సమక్షంలో సజావుగా జరిగింది. సమావేశంలో కౌన్సిలర్లు తమ తమ వార్డుల్లో నెలకొన్న పలు సమస్యల్ని అధికారుల దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా డ్రైనేజీలు, వీధి లైట్ల సౌకర్యాలు కల్పించాలని కోరారు. పలు వార్డుల్లో కుక్కల బెడద అధికంగా ఉందని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. సమస్యలను సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.25 వేలు విరాళం

గుంతకల్లుటౌన్, ఆగస్టు 31: వినాయక చవితి నిమజ్జనం రోజు అన్నదానం కోసం బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మంజుల వెంకటేష్ శనివారం రూ. 25వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి పండుగను పురస్కరించుకుని పట్టణంలో వినాయక ఘాట్‌లో విగ్రహాలను నిమజ్జనం చేయడానికి అధిక సంఖ్యలో ప్రజలు వస్తుంటారన్నారు. వారికి నగర ఉత్సవ సమితి అన్నదానం నిర్వహించనునందని, కనుక తన వంతు సాయంగా ఉత్సవ సమితికి రూ. 25వేలను అందజేసినట్లు తెలిపారు.

టీడీపీ కార్యకర్తకు పరామర్శ

పుట్లూరు, ఆగస్టు31: మండలంలోని కొండుగారి కుంట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త తిమ్మానాయుడు రెండురోజులక్రితం బైక్‌బోల్తాపడి గాయపడడంతో చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న తిమ్మానాయుడును ఆ పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు శనివారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

బొమ్మనహాళ్, ఆగస్టు 31: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు బళ్లారి విమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. బొమ్మనహాళ్ ఎస్‌ఐ నబీ రసూల్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన ఆంజనేయులు కుమారుడు రామంజి(24) మద్యానికి బానిసై ఏ పని చేయ కుండా ఉండేవాడు. దీంతో గత ఆగస్టు 28వ తేదీన కుటుంబసభ్యులు మందలించారు. మనస్థాపం చెందిన అతను ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే బళ్లారి విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం వేకువజామున మృతి చెందాడు. భార్య ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉద్యాన పంటల పరిశీలన

కళ్యాణదుర్గంరూరల్, ఆగస్టు 31 : మండలంలోని గోళ్ల పంచాయతీలో పలు ఉద్యాన పంటలను ఉద్యానశాఖ అధికారి కృష్ణతేజ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధిక వర్షాలు వచ్చినప్పుడు అవసరమైతే పంట పొలాల చుట్టూ తాత్కాలిక డ్రైనేజీలను ఏర్పాటు చేసుకుని అదనపు నీరును తరలించాలని రైతులకు సూచించారు. కూరగాయలు, పువ్వులు, పండ్లు వంటి సున్నితమైన పంటలను ప్లాస్టిక్ షీట్స్, ఇతర వస్తువులతో రక్షించుకోవాలన్నారు. బరువైన పండ్లు కలిగిన మొక్కలకు టేకింగ్ ట్రాలీస్ పద్ధతిని వాడాలని సూచించారు.

3న జాబ్ మేళా

కళ్యాణదుర్గం రూరల్, ఆగస్టు 31 : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్, ఎక్సైజ్, సీడప్, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఈనెల 3వ తేదీన పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆనంద్ రాజ్‌కుమార్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాకు ఆరు కంపెనీలు వస్తున్నట్లు చెప్పారు. టెన్త్, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన పురుషులు, మహిళలు హాజరుకావాలని తెలిపారు. 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు గల వారు అర్హులన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కురుబ సంఘం కమిటీ ఎన్నిక

కళ్యాణదుర్గంరూరల్, ఆగస్టు 31: కురుబ సంఘం పట్టణ నూతన కమిటీని పట్టణంలో శనివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఏ రామకృష్ణ, గౌరవాధ్యక్షుడిగా రేవన్నగౌడ్, ఉపాధ్యక్షులుగా కపిల్, యల్లప్ప, ప్రధాన కార్యదర్శిగా గువ్వల మదన్‌గోపాల్, కార్యదర్శులుగా రాజు, దివిటి ఎర్రిస్వామి, కోశాధికారిగా అక్కన్న, పట్టణ ప్రచార కార్యదర్శిగా వసంత్‌కుమార్‌తో పాటు పలువురిని ఈసీ మెంబర్లుగా ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడు కామక్కపల్లి నాగరాజు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి ఇన్వర్టర్ వితరణ

ఉరవకొండ, ఆగస్టు31: పట్టణంలోని ప్రభుత్వ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రికి టీడీపీ నాయకురాలు త్రివేణి ఫర్టిలైజర్స్ యజమాని భీమన్న ఇన్వర్టర్‌ను వితరణ చేశారు. ఆసుపత్రిలో డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్‌కు రూ.25వేలు విలువ చేసే ఇన్వర్టర్‌ను శనివారం వారు అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరిండింటెంట్ ఎల్లోజీ, డాక్టర్ గంగాధర్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

కుందుర్పి, ఆగస్టు 31: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపీడీవో లక్ష్మీ నరసింహ, మండల ప్రత్యేక అధికారి సురేఖ రాణి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి భోజనం మెనూను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

అర్బన్ సీఐ బాధ్యతల స్వీకరణ

రాయదుర్గం, ఆగస్టు 31: పట్టణ సీఐగా జయనాయక్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన తిరుపతి వెస్ట్ పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి ఉత్తమ సేవలు అందిస్తానన్నారు.

14న లోక్ అదాలత్

తాడిపత్రి, ఆగస్టు 31: ఈనెల 14వ తేదీన లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి కృష్ణవేణి తెలిపారు. పట్టణంలోని కోర్టులో శనివారం పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. లోక్ అదాలత్‌లో వీలైనన్ని కేసులు పరిష్కారమయ్యేలా చొరవచూపాలని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారంకాని కేసులను ఇక్కడ పరిష్కరించుకోవచ్చునన్నారు. ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.


గుమ్మఘట్ట మండలం గోనబాయిలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు


గుత్తి 14వ వార్డులో పింఛన్ పంపిణీ చేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ తదితరులు


కర్నూలు ఆస్పత్రిలో విడపనకల్లు మండలం అంచనహాలుకు చెందిన దాదాపీర్ బంధువుకు పింఛన్ అందజేస్తున్న సచివాలయ ఉద్యోగి


అనంతపురం ఆస్పత్రిలో కూడేరు మండలం పి. నారాయణపురానికి చెందిన చౌడప్పకు పింఛన్ అందిస్తున్న దృశ్యం

పండుగలా పింఛన్ల పంపిణీ

● తెల్లవారుజాము నుంచే ప్రారంభం

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: సామాజిక పింఛన్ల పంపిణీ శనివారం గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో పండుగలా సాగింది. సెప్టెంబరు 1వ తేదీన ఆదివారం సెలవు దినం కావడంతో ఆగస్టు 31వ తేదీన ఒకరోజు ముందుగానే ప్రభుత్వం పింఛన్‌దారులకు పింఛన్ పంపిణీ చేపట్టింది. సచివాలయాల సిబ్బంది, మండల అధికారులు, టీడీపీ శ్రేణులు ఉదయం 6 గంటలకే ఇంటింటికీ వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. కొన్ని చోట్ల తెల్లవారుజామునే పంపిణీ ప్రారంభించారు. ఈ పంపిణీ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. తొలిరోజునే దాదాపుగా 95 శాతం పంపిణీ ప్రక్రియ పూర్తి చేశారు. కొందరు లబ్ధిదారులు అనారోగ్యాల బారిన పడి ఇతర ప్రాంతాలలోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుండడంతో సచివాలయ సిబ్బంది అక్కడికి సైతం వెళ్లి పింఛన్లు అందజేశారు. ఇంకా కొన్ని చోట్ల వర్షంలోనూ పింఛన్ల పంపిణీ చేపట్టారు. ఒకరోజు ముందుగానే పింఛన్లు అందడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. గుమ్మఘట్ట మండలం గోనబాయి గ్రామంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై పింఛన్లు పంపిణీ చేశారు. పలు ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో సంక్షేమానికి, అభివృద్ధికి సీఎం చంద్రబాబు విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్రం సంక్షోభంలో ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీని తూచా తప్పకుండా అమలు చేస్తున్నారని తెలిపారు. అలాగే డీహీరేహాళ్ మండలం మురిడి గ్రామంలోనూ ఎమ్మెల్యే కాలవ స్థానిక టీడీపీ నాయకులు, అధికారులతో కలిసి పింఛన్ల పంపిణీ చేపట్టారు.


అనంతపురం సవేరా ఆస్పత్రిలో ఉరవకొండకు చెందిన ఆంజనేయులుకు పింఛన్ అందిస్తున్న ఉద్యోగి


కణేకల్లు మండలం ఉదేగోళంలో తెల్లవారుజామునే పింఛన్లను పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఒకే కుటుంబంలో రూ.40 వేల పింఛన్ అందజేత

కళ్యాణదుర్గం: మండలంలోని బోరంపల్లిలో ఒకే కుటుంబానికి రూ. 40 వేలు పింఛన్ సొమ్మును ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు శనివారం ఇంటికి వెళ్లి అందజేశారు. గ్రామంలోని ఎర్రిస్వామి కుటుంబంలో ఒక వృద్ధాప్య పింఛన్ రూ. 4 వేలు, ముగ్గురికి వికలాంగ పింఛన్ రూ. 36 వేలు కలిపి మొత్తం రూ. 40 వేలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పేదల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు.

బెస్తరపల్లిలో ఒకే కుటుంబానికి రూ.30 వేలు పింఛన్

కుందుర్పి: మండలంలోని బెస్తరపల్లి గ్రామంలో ఒకే కుటుంబానికి 30 వేల రూపాయలను పింఛన్ కింద అందజేశారు. గ్రామానికి చెందిన దేవేంద్రప్ప, మంజులకు రామాంజనేయులు, గీతమ్మ సంతానం. అయితే ఆ ఇద్దరూ వికలాంగులు. దీంతో వారికి ఒక్కొక్కరికి నెలకు రూ.15 వేలు చొప్పున పింఛన్ అందుతోంది. ఈ క్రమంలో ఇద్దరికీ కలిపి రూ.30 వేలు పింఛన్ అందించారు. ఇంటి వద్దకే అధికారులు, స్థానిక టీడీపీ నాయకులు వెళ్లి పింఛన్ సొమ్మును అందజేశారు.


బోరంపల్లిలో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు


కుందుర్పి మండలం బెస్తరపల్లిలో దివ్యాంగులకు పింఛన్ అందిస్తున్న దృశ్యం

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి: ఎమ్మెల్యే

కళ్యాణదుర్గం, ఆగస్టు 31 : గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని, అందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు. స్వచ్ఛమిషన్‌లో భాగంగా నియోజకవర్గంలోని పది పంచాయతీలకు చెత్తను తొలగించేందుకు ట్రాక్టర్లు మంజూరు కాగా.. పట్టణంలోని ప్రజావేదిక వద్ద శనివారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామాలను ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దేందుకు శాయశక్తులా కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.


ట్రాక్టర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరాలి

● విద్యార్థులకు ఎమ్మెల్యే కాలవ సూచన

డీ.హీరేహాళ్, ఆగస్టు 31: బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విద్యార్థులకు సూచించారు. మండలంలోని మురిడి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో శనివారం విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న యూనిఫాం, షూస్ తదితరాల పంపిణీ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాలవ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేస్తోందన్నారు. గ్రామాలలో పేదరిక నిర్మూలన కేవలం విద్యతోనే సాధ్యమవుతుందన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. తర్వాత విద్యార్థులకు యూనిఫాం, షూస్ తదితర సామగ్రి గల కిట్లను పంపిణీ చేశారు. తొలుత ఎమ్మెల్యే గ్రామంలోని ఆంజనేయ స్వామిని దర్శించుకుని పూజలు చేయించారు. తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ రఘునాథ్, ఆలయ ఈఓ నరసింహారెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నాగళ్లి రాజు, మాజీ ఎంపీపీ మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ గంగాధర తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా కృష్ణారెడ్డి

గుంతకల్లు, ఆగస్టు 31: మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా టీడీపీ నాయకుడు, న్యాయవాది బీఎస్ కృష్ణారెడ్డిని నియమిస్తూ మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య శనివారం నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ నెల 28వ తేదీన నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశంలో స్టాండింగ్ కౌన్సిల్ నియామకానికి టీడీపీకి మెజారిటీ ఉన్నా చైర్‌పర్సన్ వాకౌట్ చేసిన సంగతి విధితమే. ఆమె తీర్మానాన్ని రికార్డు చేయనందున నిబంధనలను అనుసరించి స్టాండింగ్ కౌన్సిల్ నియామకం ఆరోజు ప్రకటించలేకపోయారు. కానీ ఆ విషయంపై టీడీపీ నాయకులు కమిషనర్‌ను కలిసి అభ్యంతరాలను వ్యక్తపరిచారు. కమిషనర్ ఉన్నతాధికారులకు విన్నవించగా, వారి నుంచి వచ్చిన సూచనల మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్ భవానిని పిలిచి కౌన్సిల్‌లో టీడీపీకి స్పష్టమైన మెజారిటీ ఉన్నందున స్టాండింగ్ కౌన్సిల్‌గా కృష్ణారెడ్డి నియామకానికి సంబంధించి తీర్మానాన్ని చేర్చాలని తెలియజేశారు. అంగీకరించిన చైర్‌పర్సన్ మినిట్స్ రికార్డులో కృష్ణారెడ్డికి అనుకూల తీర్మానాన్ని చేర్చారు. ఈ మేరకు బీఎస్ కృష్ణారెడ్డికి కమిషనర్ నియామకపు ఉత్తర్వును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు బండారు ఆనంద్, కౌన్సిలరు ఉడదాల ప్రభాకర్, నాయకులు తలారి మస్తానప్ప, బండారు పులికొండ, కళ్యాణ్ బాబు, కేవీ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా అడ్డుకట్టకు ప్రత్యేక టీం

తాడిపత్రి, ఆగస్టు 31: తాడిపత్రిలో ఇసుక అక్రమ రవాణా అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక టీంను ఏర్పాటుచేసినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ పెన్నా పరివాహక ప్రాంతంలో ఎవరూ ఇసుకను అక్రమంగా తరలించకుండా ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు ప్రత్యేక టీంను ఏర్పాటుచేశామన్నారు. ఈ టీంలో ఎస్‌ఐ స్థాయి అధికారితోపాటు హెడ్‌కానిస్టేబుల్, నలుగురు కానిస్టేబుళ్లు ఉంటారని ఆయన తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ పూజలు

బెళుగుప్ప, ఆగస్టు 31: శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ముఖ్యంగా బూదిగుమ్మలో వెలసిన ఆంజనేయస్వామి, పద్మావతీ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో అర్చకులు ఉదయమే మూలవిరాట్‌లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆలూరు కోనలో ప్రత్యేక పూజలు

తాడిపత్రి, ఆగస్టు31: శ్రావణమాసం చివరి శనివారాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆలూరుకోనలో శ్రీదేవి, భూదేవి సమేత రంగనాయకుల స్వామివారికి ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు ఉదయాన్నే స్వామి, అమ్మవార్ల మూల విరాట్‌కు పలు అభిషేకాలు చేసి వివిధ పుష్పాలు, వెండి ఆభరణాలతో విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. శ్రావణమాసం చివరివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.


విశేష అలంకరణలో ఆలూరు రంగనాథస్వామి

డ్రైఫ్రూట్స్‌తో అలంకరణ


డ్రైఫ్రూట్స్‌తో స్వామి వారికి అలంకరణ

గుంతకల్లుటౌన్, ఆగస్టు 31: శ్రావణ మాసం చివరి శనివారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని రాజేంద్రనగర్‌లో గల వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారిని డ్రైఫ్రూట్స్‌తో అలంకరణ చేశారు. ఉదయమే అర్చకులు మూలవిరాట్‌కు పలు అభిషేకాలు చేశారు. అనంతరం డ్రైఫ్రూట్స్‌తో అలంకరించి ప్రత్యక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు పొందారు.

ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు

యల్లనూరు, ఆగస్టు 31: మండలంలోని పలు ఆంజనేయస్వామి ఆలయాల్లో శ్రావణమాస ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ముఖ్యంగా యల్లనూరు, చిలమకూరు ఆలయాల్లో అర్చకులు మూలవిరాట్‌లకు అభిషేకాలు చేసి తమలపాకులతో అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని తీర్థప్రసాదాలు పొందారు.

నవనీత అలంకరణలో ఆంజనేయుడు

కణేకల్లు: మండల కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి వద్ద ఉన్న సీతారామాంజనేయ స్వామి ఆలయంలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని నవనీత అలంకరణలో ప్రత్యేకంగా అలంకరించారు. వెన్న, బాదంలతో, వడమాలతో అలంకరించి విశిష్ట పూజలను జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామి దర్శనం చేసుకున్నారు. అర్చకుడు విజ్జిస్వామి తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో యల్లనూరు ఆంజనేయస్వామి

చిన్ననాగుల కట్ట వద్ద ప్రత్యేక పూజలు

కణేకల్లు మండల కేంద్రంలోని ఉరవకొండ రోడ్డులో ఉన్న చిన్ననాగుల కట్ట వద్ద భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. శ్రావణమాస చివరి శనివారాన్ని పురస్కరించుకుని ఈ పూజలు జరిపారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలి

గుంతకల్లుటౌన్, ఆగస్టు 31: పట్టణంలో పలు కాలనీల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు పట్టణంలోని విద్యుత్ ఏడీఏ కార్యాలయంలో ఏడీఏ రంగస్వామికి శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్ మాట్లాడుతూ.. పట్టణ నడిబొడ్డున ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయని, అలాగే విద్యుత్ తీగలు తక్కువఎత్తులో వేళాడుతున్నాయని, వాటి వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారని అన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీర భద్రస్వామి, సహాయకార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

వైభవంగా పల్లకి సేవ

ఉరవకొండ, ఆగస్టు 31: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకి సేవను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు తొలుత ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చి మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి, స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


పెన్నహోబిళంలో ఉత్సవ మూర్తి ఊరేగింపు

ఘనంగా వసంతోత్సవం

వజ్రకరూరు మండలం కొనకొండ్లలో ఆదిచెన్నకేశవుని రథోత్సవంలో భాగంగా వసంతోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ఆలయంలో స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం వసంతోత్సవాన్ని నిర్వహించి.. ఒకరిపై ఒకరు రంగులను చల్లుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కృష్ణయ్య పాల్గొన్నారు.

3 నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు

తాడిపత్రి, ఆగస్టు31: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఈనెల 3వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ పీవీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని తన నివాసంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. అందులో భాగంగా తాడిపత్రి నియోజకవర్గంలో కూడా పెద్దఎత్తున సభ్యత్వ నమోదును జరపనున్నట్లు తెలిపారు. సమావేశంలో కర్నూలు జిల్లా ఇన్‌చార్జి అంకాల్‌రెడ్డి, నాయకులు హరీష్‌రెడ్డి, రంగనాథరెడ్డి, శింగరి లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, గంగాధర్‌యాదవ్, రామచంద్రారెడ్డి, ఆదిశేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి

గుత్తి: బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన సభ్యత్వ నమోదుపై కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. బీజేపీని దేశంలో మరింత బలపరచాలని, ఇందుకు ప్రతి పోలింగ్ బూత్‌లో 200పైగా సాధారణ సభ్యత్వం నమోదు చేయాలని తెలిపారు. క్రియాశీలక సభ్యులు కాదలచిన వారు వంద మందిని చేర్పాలన్నారు. ప్రతి ఒక్కరూ నూతనంగా సభ్యత్వం తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల ఇన్‌చార్జి తిమ్మారెడ్డి, రాష్ట్ర సభ్యుడు రంగరాజు, పట్టణ అధ్యక్షుడు బాలకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన గుత్తి టీడీపీ నాయకులు

గుత్తి రూరల్, ఆగస్టు 31 : మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో శనివారం సీఎం చంద్రబాబును గుత్తిమండల టీడీపీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు కరిడికొండ సూరి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారిని గుర్తించి, నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కోరారు. గుత్తి మార్కెట్ యార్డు చైర్మన్ పదవి తనకు ఇవ్వాలని కోరుతూ బయోడేటాను అందజేశారు. తాను పార్టీ కోసం 30 ఏళ్లుగా క్రియాశీలకంగా పని చేస్తున్నానని వివరించారు. కార్యక్రమంలో తెలుగు యువత మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, నాయకులు గిరి ప్రసాద్ నాయుడు, జీఎం బాషా తదితరులు పాల్గొన్నారు.


సీఎంను కలిసిన కరిడికొండ సూరి తదితరులు

గజరాంపల్లి ఎస్ఎంసీ ఎన్నిక ఏకగ్రీవం

పామిడి, ఆగస్టు 31 : మండలంలోని గజరాంపల్లిలో శనివారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఇక్కడ ఎస్ఎంసీ ఎన్నికలు వైసీపీ నేతల ప్రలోభాలతో పలు మార్లు వాయిదా పడ్డాయి. దీంతో శనివారం మరోసారి ఎన్నికలను ఎంఈఓ జయానాయక్ సమక్షంలో నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఏకగ్రీవంగా ఈ ఎన్నికలు ముగిశాయి. చైర్‌పర్సన్‌గా సుజాతను, వైస్‌చైర్మన్‌గా రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియామక పత్రాన్ని ఎంఈఓ అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణ పాల్గొని మాట్లాడారు. కొందరు వైసీపీ నాయకులు అధికారులను అడ్డుపెట్టుకొని అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అభివృద్ధికి అడ్డుతగిలితే ఎంతటివారినైనా వదిలే ప్రసక్తేలేదని హెచ్చరించారు. అనంతరం ఎస్ఎంసీ చైర్మన్, వైస్‌చైర్మన్‌లను సత్కరించారు. నాయకులు మారుతి వరప్రసాద్‌రెడ్డి, హనుమంతరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, రాజు, దివాకర్ తదితరులు పాల్గొన్నారు.


నియామక పత్రం అందజేస్తున్న ఎంఈఓ జయానాయక్, టీడీపీ నేత గుమ్మనూరు నారాయణ